# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



సంపుటి 33 సంచిక 5
పేజీలు 40
జనవరి 2014

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


భద్రవాక్యం ........................................2

శ్రీబాబూజీ ఉవాచ 3

శ్రీమాతాజీ సత్సంగ సమావేశాలు 5

శ్రీమాతాజీ అభిభాషణ 6

సన్నిధిలో సంభాషణ 10

యోగవాశిష్ఠము 12

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు 15

గురు కృపాహి కేవలమ్ 16

పరిప్రశ్నేన సేవయా 18

తెలిసిందీ! తెలిసింది! 19

శ్రీకృష్ణ కర్ణామృతం 20

సర్వము నీ దయ 22

బ్రహ్మ కడిగిన పాదము 24

శివాలయ మహత్తు 26

సంక్రాంతి 28

దివ్యదర్శనం 30

బాబూజీతో అనుభవాలు 31

కృతజ్ఞతలు 36

సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర 37

విష్ణు కథలు – 'రోహిదాసు' 39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

న సంధృశే తిష్ఠతి రూపమస్య
న చక్షుషా పశ్యతి కశ్చ నైనమ్

హృదా మనీషా మనసాఽభిక్లుప్తో
య ఏత ద్విదు రమృతాస్తే భవంతి

(కఠోపనిషత్ ద్వితీయోధ్యాయం/షష్ఠివల్లి)

ఉద్ధాలకుడు సర్వమేధము అను యాగము నిర్వహించిన కారణంగా తనకున్న యావదాస్తిని, గోవులను ఋత్విక్కులకు దానం చేయటంలో మునిగి ఉన్న సమయంలో అతని సుతుడు నచికేతుడు తండ్రిని ప్రశ్నిస్తూ "నాయనా! నన్నెవరికిస్తావు?" అని పలుమార్లు ప్రశ్నించాడు. విసిగి వేసారిన తండ్రి "నిన్ను యమునికిస్తాను" అని పలికిన తండ్రిని సత్యసంధుని చేయ నిశ్చయించుకుని, యమపురికి చేరి, యముని దర్శనార్థం నిద్రాహారాలు లేక ఉన్న బాలునికి యమధర్మరాజు బహుమతిగా మూడు వరాలను అనుగ్రహించాడు. మూడవ వరంగా బ్రహ్మజిజ్ఞాసువైన నచికేతుడు ఆత్మతత్త్వాన్ని గూర్చి ప్రశ్నించిన విషయాన్ని విశదీకరించిన యమధర్మరాజు సమాధానమే యీ శ్లోకము.



ఆత్మ బాహ్యేంద్రియాలకు, అంతరేంద్రియాలకు గోచరించదు. మనసు సంకల్ప వికల్ప రూపముకాని నిశ్చయాత్మకమైన బుద్ధి మనసుని వశపరచుకొని, ఆత్మతత్త్వము తెలుకొన వీలవుతుంది. ఆత్మ అగోచరమని, ఆత్మను నిరూపించు ప్రమాణము లేదన్న మనస్సు యొక్క భావాన్ని వివేక వంతమైన బుద్ధిచేత తొలగించాలి. అది సాధ్యమా? మనోవృత్తిని తొలగించటానికి శ్రవణం గొప్ప సాధనము. శ్రవణం ద్వారా మనస్సు సంకల్ప వికల్ప శక్తిని కోల్పోయి, బుద్ధిలో లయమవుతుంది. దాని ద్వారా మహావాక్యార్థ జ్ఞానం కలుగుతుంది. ఆత్మ తత్త్వం మనస్సు నందు స్థిర పడటానికి మననం తోడ్పడుతుంది. 'మనసా అభిక్లుప్తః' అన్న మంత్రం దాన్ని ధృవీకరిస్తోంది కదా! అంతేకాదు ఆత్మవస్తువు శ్రవణ మననముల ద్వారా సంభావితము, నిర్ధారితము అని తెలుస్తున్నది. అలా ఆత్మతత్త్వాన్ని ఎరిగినవారు అమృతులే. సద్గురుమూర్తిని ఆశ్రయించి, ఆయన బోధను శ్రవణం చేసి, దానిని మననం చేసినవారు అమృతులు కాక మరెవరు?

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధనచేస్తూ "మానవులను సృష్టించిన భగవంతుడు వారికి జన్మరాహిత్యాన్ని ప్రసాదించక తప్పదు కదా! మరి మానవుడు సాధన చేయవల్సిన అవసరమేమిటి? సాధన ఎవరికోసం చేయాలి? దారాపుత్రాదులను ఉద్ధరించడానికా? లేక తను ఆశ్రయించిన గురుమూర్తికి ఏదైనా లాభింపజేయటానికా? లేక తన కుటుంబ పరువు ప్రతిష్ఠలు పెంచటానికా? అని సాధకులకు సందేహాలు కలగవచ్చు. కాబట్టి ప్రతిసాధకుడు తాను చేసే సాధన ఆంతర్యమేమిటో తెల్సుకోవాలి. 'జంతునాం నరజన్మదుర్లభం' అన్నట్లుగా ఉత్కృష్ఠమైన మానవజన్మ ఎత్తినందుకు దాని పరమార్థమేమిటో తెల్సుకొనటానికి చేసే ప్రయత్నమే సాధన.



మన నిత్య జీవితంలో మనం నిర్వహించే ఎన్నో పనులు ఎంతో శ్రద్ధగా, సక్రమంగా చేస్తేనే అవి ఫలిస్తాయి. అలాగే మీ జీవిత పరమార్థమేమిటో తెల్సుకోవటానికి పురుష ప్రయత్నం చేయ్యాలికదా!"

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "సాధనకి ప్రధానంగా కావల్సినది తత్పరత లేక ఆవేదన. ఏదైనా సాధించాలి. అనుకున్నప్పుడు దానియందు ఆసక్తి ఉండాలికదా! ఆసక్తి ఉంటే దానిపైన ప్రేమ కల్గుతుంది. వస్తువు లేక ప్రాపంచిక విషయాలపైన కలిగే ఆసక్తి లేక ప్రేమని మోహము అంటారు. కానీ ముముక్షువు సాధన ద్వారా పెంపొందించుకున్న ప్రేమ లేక ఆసక్తి తన సుఖాన్ని త్యాగం చేస్తుంది.

సాధకుడు చేసే త్యాగమే అమృతత్త్వానికి తీసుకుని వెడుతుంది. అందువల్లనే 'త్యాగేనైకే అమృతత్త్వమానసు'. అన్నారు. అసలు సాధన ఎందుకు చేయాలి? అని ప్రశ్నించుకుంటే ప్రతి మానవుడు తాను చేసే సాధన శాంతిని, ఆనందాన్ని పొందటానికే కదా. ఒక తల్లి తన పిల్లవాడికి సంచీ ఇచ్చి బజారుకి పంపి సరుకులు తెమ్మంటే బజారులో ఆకర్షణలకు లొంగిపోయి తను వచ్చిన పనిని మర్చిపోయాడు. కాని తల్లి

ఊరుకుంటుందా! పిల్లవాడు ఎంతసేపైనా రాకపోయేసరికి వాడికోసం అన్వేషణ ప్రారంభిస్తుంది. అలాంటిదే మానవ జీవితం. భగవానుడు మానవుడికి దేహము, ఇంద్రియాలు, మనస్సు, బుద్దినిచ్చి ఈ జన్మ రహస్యమేమిటో తెలుసుకోమని పంపించాడు. కానీ మానవుడు ఈ ప్రాపంచిక ఆకర్షణలకు లొంగిపోయి తానువచ్చిన పనిని మర్చిపోయాడు. కానీ భగవానుడు ఊరుకుంటాడా?

ఆయన మనల్ని తన దరిచేర్చుకుని హెచ్చరిస్తారు. చూశారా భగవానుడి యొక్క ప్రేమ ఎలా ఉంటుందో! సాధకుడు ఆవేదనతో పాటు అహంకార రహితుడై ఉండాలి. ఈ ప్రజ్ఞ నాది అని అనుకోవడమే అహంకారము. అహంకారమే సాధనకి ప్రధాన ప్రతిబంధకము. దీనిని రహితం చేసుకోవాలి అంటే వివేకంతో కూడిన విచారణ చెయ్యాలి. పరశు రాముడు అహంకారంతో క్షత్రియులందరినీ సంహరించి శ్రీరామచంద్రునితో యుద్ధమునకు సిద్ధపడి అవమానము పొంది దత్తాత్రేయస్వామి అనుగ్రహంతో వివేకవంతమైన విచారణ చేసి శాంతిని పొందాడు కదా!

సాధకుడు సద్గురుమూర్తిని ఆశ్రయించి భగవద్గీతలోచెప్పినట్లు "సర్వధర్మాన్ పరిత్యజ్య, మామేకం శరణం వ్రజ" అన్నట్లుగా సంపూర్ణ శరణాగతి పొందాలి. అప్పుడే తాను అనుకున్నది సాధించగల్గుతాడు. ఇక్కడ మీకు ఒక ఉదంతం చెబుతాను. ఒక గుడ్డివాడు ఉన్నాడు. వాడి స్నేహితుడు ఒక కుంటివాడు. ఇరువురు కలసి ప్రయాణం సాగించారు. గుడ్డివాడికి గమ్యస్థానం ఎలా చేరాలో తెలుసు. కానీ చూపులేని కారణంగా వెళ్ళలేడు. కుంటివాడు కాళ్ళులేవు కాని గుడ్డివాడు తెలియజేసే మార్గంలో గమ్యస్థానానికి చేర్చగల్గుతాడు.

చూశారా శాస్త్ర జ్ఞానము సాధకునికి తాను చేరవల్సిన గమ్యస్థానాన్ని గురించి వివరాలు ఇవ్వగల్గుతుంది. ఈ శాస్త్రజ్ఞానానికి గురువు ఉపదేశం తోడైతే సాధకుడు సులువుగా గమ్యస్థానం చేరగల్గుతాడు. శాస్త్రజ్ఞానము గురూపదేశము ద్వారా అనుభవములోనికి తెచ్చుకొనటమే నిజమైన సాధన. అప్పుడే గమ్యస్థానాన్ని చేరుకోగల్గుతావు అని అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.



# పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశములు



23-01-2014 గురువారం నుండి 26-1-2014 ఆదివారం వరకు

సాయంత్రం 5గం.ల నుండి రాత్రి 8గం.ల వరకు క్లబ్ హౌస్, L&T సెరిన్ కౌంటీ అపార్ట్‌మెంట్స్, టెలికాం నగర్, గచ్చిబౌలి, హైదరాబాద్ - 500 032

**<u>ఉదయం కార్యక్రమము</u>**

లోటస్ ప్లాట్ నెం. 74, L&T సెరిన్ కౌంటీ అపార్ట్‌మెంట్స్, టెలికాం నగర్, గచ్చిబౌలి, హైదరాబాద్.

తె॥జా 4-00గం.ల నుండి 4-30ని॥ల వరకు సుప్రభాతం

తె॥జా 4-30ని॥ల నుండి 6-00గం.ల వరకు ధ్యానం, ప్రార్థన.

ఉదయం 9-00గం.ల నుండి మధ్యాహ్నం 12-00గం.ల వరకు సంకీర్తన మరియు పూజ్యశ్రీ మాతాజీవారిచే తీర్థ ప్రసాదములు.

**<u>విశేష కార్యక్రమము</u>**

26-01-2014 ఆదివారం ఉదయం 10గం.ల నుండి 12గం.ల వరకు శ్రీసద్గురు పాదపూజ మరియు పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశము. క్లబ్ హౌస్, L&T సెరిన్ కౌంటీ అపార్ట్‌మెంట్స్, టెలికాం నగర్, గచ్చిబౌలి, హైదరాబాద్‌లో జరుగును.

బాబూ భక్త సమాజ్, హైదరాబాదు

సంప్రదించవలసిన వారు

పి. కిరణ్‌బాబు : 85019 73000, 040-23003382

జి. జగదీశ్వర్ : 9985666797, 040-27766284

# శ్రీ మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి)

-జపమాలా ప్రసాద

సాధన సమయంలో ఎదురయ్యే పరీక్షలన్నీ మన సాధన కోసమే. మనం పందిరి వేసేటప్పుడు, గాలికి ఆగడం కోసం, పందిరి రాట్లని ఎన్నో దెబ్బలు వేసి లోతుకి దిగేటట్లు చేసి పాతుతాం కదా! ఎన్ని ఉలిదెబ్బలు తింటే, దారిన పడివున్న రాయి ఒక దేవతామూర్తిగా మలచబడుతున్నది? అదే విధంగా, గురుమూర్తి కూడా, తమ శిష్యుల యొక్క శ్రద్ధా తితీక్షలని యినుమడింప చేయడం కోసం, అనేక పరీక్షలు పెడతారు. నిజమైన సాధకుడు, "నన్ను రక్షించినా, భక్షించినా, నా గురుదేవుడే నాకు శరణ్యం" అని గురుపాదాన్ని ఎప్పుడూ విడువడు. గొప్ప అనుభూతులు వస్తే పొంగిపోయి "నాకు కదా ఇంతటి అనుభూతులు వస్తున్నాయి" అని అనుకున్నా పతనమే. "నాకు ఎట్టి అనుభూతులు లేవు. ఈ కష్టాల వలయంలో యిరుక్కుపోయానే" అని క్రుంగనూ కూడదు. "నా గురుదేవుడు అనుక్షణ శిక్షణ, పరీక్షా, పరిరక్షణ, దీక్షా దక్షుడు" అని నమ్మాలి.




ఆ విధంగా గురుమూర్తిని పరిపూర్ణంగా నమ్మిన శిష్యునికి, "నువ్వు ఏ జగత్తయితే నిజమని భావించి, సుఖదుఃఖాలకు గురి అవుతున్నావో అదంతా స్వప్నతుల్యం రా నాయనా! దానిని నిజమని భ్రమించి కలత చెందకురా" అని చెప్పి, కలలాంటి యీ జగత్తులో నిజ జాగ్రత్త కలిగి వుండమని బోధ చేస్తున్నారు గురుమూర్తి.

"నీవు జూచునదెల్ల నీవయే ననుచు తత్త్వమసి వాక్యమున కర్థమ్ము నిజమ్ము " గురుతత్వమును కీర్తిస్తూ తాము రచించిన "శ్రీ కాళీప్రసాదాష్టకము" నందు శ్రీ పరిమి సుబ్రహ్మణ్య భాగవతార్ గారు చెప్పి ఉన్నారు. నీవు చూచుచున్నదంతా నీ స్వరూపమే అని, "తత్త్వమసి" అనే వాక్య బోధను చేస్తారు గురుదేవులు. దానిని అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలి అంటే, గురుమూర్తి పెట్టే పరీక్షలని ఎదుర్కోడానికి సచ్ఛిష్యుడు ఎల్లవేళలా జాగరూకత, దీక్షా ధైర్యములు కలిగి ఉండాలి.

అలాగని "నేను ఎదుర్కోగలను" అని అహంకారంతో విర్రవీగకూడదు.

అహంకారం పతన హేతువు,"ప్రభూ! నీట ముంచినా, పాలముంచినా నీ దయ తండ్రీ!" అని సంపూర్ణ శరణాగత భావం కలిగి ఉన్న నాడు, తాము పెట్టే పరీక్షల నెదుర్కునే ధైర్య సాహసాలను, అకుంఠిత దీక్షను కూడా గురుదేవులే ప్రసాదిస్తారు. ఏ తండ్రైనా తన బిడ్డ ఫస్టు మార్కులతో పాసవ్వాలని కోరుకుంటాడే గాని, ఫెయిలు అవ్వాలని కోరుకోడు కదా! ఈ తండ్రుల ప్రేమలే అలా వుంటే, మరి సమస్త జగత్తుకి తండ్రి అయిన గురుమూర్తి ప్రేమని కొనగలమా? అందుకే గురుపాద సన్నిధిని ఎన్నడూ మరువరాదు.

గురుమూర్తి బోధించిన "తత్వమసి" అంటే "నీవు ఆ తద్వస్తువు అయి ఉన్నావు" అనే మహావాక్యార్ధాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలంటే మనస్సు నిర్విషయమవ్వాలి. అదే ధ్యానం అంటే అని 'స్కందోపనిషత్తు' చెపుతున్నది. పరమశివుని పుత్రుడైన స్కందుడు. తండ్రి రూపంలో ప్రకాశిస్తున్న తన గురుమూర్తికి (ఆది గురుడైన శ్రీశంకరుడికి) తాను పొందిన అనుభవాన్ని "స్కందోపనిషత్" లో వివరించారు.

"దేహో దేవాలయ ప్రోక్తః జీవో దేవస్సదాశివః (సనాతనః)
త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యమ్ సోఽహమ్ భావేన పూజయేత్
అభేద దర్శనమ్ జ్ఞానమ్ ధ్యానమ్ నిర్విషయమ్ మనః "

"నశించే దేహము నీవు కాదురా, దానిలోనే వుండి, దానిని ప్రకాశింప చేస్తున్న శుద్ధ చైతన్యమే పరమాత్మ! ఆపరమాత్మ నాశనము లేని అక్షర స్వరూపుడు" అని బోధ చేసి సద్గురునాధులు మనకి ఆ అక్షర స్వరూపుని తత్వాన్ని సూచన ప్రాయంగా తెలిపే "అక్షరాన్ని" మన హృదయం మీద ముద్ర వేస్తారు. వారు ప్రపాదించే అక్షర ప్రణవం అదే ఉపదేశం.

గురుమూర్తి ప్రసాదించిన మంత్రమును చక్కగా అనుష్ఠానం చేయడం వలనను, మనన, నిదిధ్యాసలు అభ్యసించడం వల్లను వాచ్యార్థంలో 'జీవుడని' వ్యవహరింపబడేవాడే, లక్ష్యార్థం సాధించేసరికి 'ఈశ్వరుడని' గ్రహిస్తాడు శిష్యుడు. అప్పుడు ఈ దేహమే దేవాలయమని, అందులో ఉన్న జీవుడే సదాశివుడని అనుభవ పూర్వకంగా తెలుసుకో గలుగుతాడు. అజ్ఞానమనే నిర్మాల్యాన్ని తీసిపారేసి, "సోఽహమ్"

అద్వితీయమైన ఆ పరమాత్మ వస్తువే 'నేను' (సః అహమ్ సోఽ హమ్) అని తెలుసుకొని, ఆ భావనతోనే పూజ చేస్తాడు. భగవంతుడు తప్ప రెండవది లేదు అని అభేద దర్శనాన్ని పొందడమే జ్ఞానం. ఇక అప్పుడు మనస్సులో విషయమనేదే ఉండదు కనుక, మనస్సు నిర్విషయ మవ్వడమే ధ్యానం. ఇంతటి దివ్యస్థితిని మనకి ప్రసాదిస్తుంది గురుపాదం.

మహాత్ములు మనకోసం అవతారాన్ని ధరించి వచ్చారు. వారు మన కంటికి కనిపించనంతమాత్రాన, వారెక్కడికో వెళ్ళిపోయారని మటుకు అనుకోవద్దని మరొక్కసారి మనవి చేసుకుంటున్నాను. "నానవాప్తమ్! అవాప్తవ్యమ్ వర్త ఏ వచ కర్మణి" అని కృష్ణ భగవానుడు శెలవిచ్చినట్లు, మహాత్ములు - వారు పొందలేనిదీ, పొందవలసినదీ ఏదీ లేనప్పటికీ జగత్ కల్యాణం కోసం కర్మ చేస్తూ, వారి సర్వస్వం త్యాగం చేస్తున్నారు. వారి శరీరాన్ని ఏమాత్రం లెక్కించచక, మనని ఆచరింప చేయడం కోసం గురుదేవులు పూజ, జప,తప ధ్యానాది అనుష్ఠానాలను తామాచరించి మనకి మార్గదర్శకులయ్యారు.

సర్వసంగ పరిత్యాగులయిన అట్టి మహాత్ములు చెప్పిన (నడచిన) బాటలో మనం నడచినట్టయితే మనం చేరవలసిన గమ్య స్థానాన్ని మనం చేరగలుగుతాం. అలా కాకుండా సంసార విషయాదులలోనే మునిగిపోయి, "అయ్యో! ఈసంసారం అనే ఊబి నన్ను లోనికి లాగివేస్తోందే!" అని గోల పెడతారు కొందరు. దీనికే గురుదేవులు ఒక చిన్న కథ చెప్పేవారు.

కోతులని పట్టేవాడొకడు అడవిలో ఒక చిన్న గుంట త్రవ్వి, అందులో ఒక పెద్ద పొట్ట, సన్నటి మెడ వున్న కూజా నిండా పప్పు బెల్లాలు, కొబ్బరి ముక్కలు నింపి, కూజా మూతి మాత్రం పైకి కనబడేట్టు ఉంచి, మిగతా కూజాని గోతిలో పాతిపెట్టి, ఆ దారమ్మటా కూడా పప్పులు జల్లి, తాను దగ్గరలోనే ఉన్న పొద వెనకాల దాక్కుని, వేచి చూస్తూ ఉంటాడు.

ఎక్కడనుండో ఒత కోతి వచ్చి, ఈ పప్పులని ఏరుకుని తింటూ తింటూ కూజా దగ్గరకి వస్తుంది. అక్కడ మరింత అధికంగా పప్పులు కనబడడంతో, ఆనందంగా గంతులేసి, పప్పులకోసం కూజాలో చేయి పెడుతుంది. గుప్పిట నిండా పప్పులు తీసుకుందో లేదో, వేటగాడు తన వేపు రావడం చూస్తుంది ఈ కోతి. మూసి ఉన్న తన గుప్పిడి ఎంత

ప్రయత్నించినా భయటకి రాకపోవడంతో, " అయ్యో! లోపల ఏదో భూతం ఉన్నట్టుంది. అది నా చేతిని పట్టుకుని బయటకు రానీయటంలేదు" అని వాపోయిందిట! వేటగాడు వచ్చిదానిని తోలుకు పోయాడు!

గుప్పిడి విప్పేసి పప్పులని వదిలేస్తే ఆకోతికి స్వేచ్ఛ లభించి వుండేది. మానవుడు కూడా సంసార విషయాలని గట్టిగా పట్టుకొని, ఆశాబద్ధుడై జీవితాన్ని వ్యర్థం చేసుకొని యముని పాలవుతున్నాడు. అక్కడ తన ఆశే తనని బంధించింది. ఆశ అనే గుప్పిటిని వదిలేస్తే స్వేచ్ఛే. తను గుప్పిడి బిగించి వుంచుకుని, లోపలనుండి సంసారమనే భూతం తనని కబళిస్తోందని చెప్పుకుంటాడు మూర్ఖుడు.

కనుక, విషయాదులను విడిచిపెట్టి, మహాత్ములుపదేశించిన ముక్తి మార్గంలో పయనించి, కాలుడు వచ్చి కబళించే లోగానే గమ్యం చేరుకోవాలి. అట్టి సాధన చేయడానికి కావలసిన సాధనాసంపత్తిని, అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి సర్వదా గురపపాదుకలు కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!

సమాప్తమ్

ఎదుటివాడు నీ పట్ల ఎంత కఠినంగా ప్రవర్తించినా నీవు ఎల్లప్పుడూ శాంతంగా ఉండాలి. నీవు అడిగింది కాదన్నా, లేక నీ మీద తప్పు పట్టినా, నిన్ను నిందించినా, లేక పొగిడినా నీవు అన్నీ విని సహించి ఊరుకోవాలి. అదే నిజమైన ధైర్యం, స్థైర్యం.

ఒకడు సైన్యాన్ని లొంగదీయ గలడు. కాని తన కోపాన్ని జయించలేడు. కామక్రోధాలు, కాంచనము ఇవి మూడు భగవంతుణ్ణి దూరం చేసేవి. కామము, కాంచనములను జయించినా, క్రోధాన్ని జయించటం చాలా కష్టము.

ఈ మూడు జయించగలిగితే నీవు మహాత్ముడవన్నమాటే. కామ క్రోధ కాంచనాలను జయించినవారే మహాత్ములు.

– అవతార్ శ్రీ మెహర్‌బాబా

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

11-12-1985

"నిజమైన పండితుడు అంటే ఎవరు తారకం?" అని శ్రీబాబు ప్రశ్నించి "కులశేఖర అళ్వార్‌ని చెప్పకోవచ్చు కదా!" అన్నారు. "ఆయన మహాచక్రవర్తి భోగభాగ్యాలకు లోటులేదు.



గృహాస్థాశ్రమంలో ఉన్నా ఆయన మనస్సు ఏ భోగానికి చలించలేదు. ఆయనలో రాగద్వేషాలు గాని, కులాభిమానం గాని, మతాభిమానం గాని లేవు. ఆయనది ఏ కులం? బ్రహ్మకులం. ఆ కులంలో నీది నాది అనే వివక్షత లేదు. నేను చక్రవర్తిని అనే భావం అంతకన్నా లేదు. ప్రజలందరిని ఏక దృష్టితో చూశాడు. ఆయన మనస్సు ఎప్పడూ ఆ పరమాత్ముని దివ్య చరణార విందములపై పుట్టుమచ్చలాగా నిలిచి ఉండేది.

గోడమీద బల్లిలాగా కాదు. గోడమీద బల్లి ఎప్పడైనా ఒకసారి క్రిందపడిపోవచ్చు. కామక్రోధాది గుణాలతో కూడి ఉన్న వాడి మనస్సు పరమాత్ముని దివ్య చరణావిందములపై నిలవదు. నిలిచినా అది గోడమీద బల్లిలాగా ఎప్పడైనా జారిపోయే ప్రమాదం ఉంది. అది మర్కట కిశోర న్యాయము" అన్నారు బాబు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ 'జపాన్‌లో అణ్వస్త్రం ప్రయోగించినపుడు కొన్ని వేలమంది ప్రాణాలు కోల్పోయారు. కాని కామక్రోధాది గుణాలు రహితం కాని రాక్షస ప్రవత్తి గల మానవుల ద్వారా అంతకన్నా ఇంకా ఎక్కువ ప్రమాదం సంభవించవచ్చు. కాబట్టి భగవంతుని యందు విశ్వాసము పెంపొదించుకోండి. భగవంతుని యందు విశ్వాసము లేనివాడు రెక్కలు లేని పక్షితో సమానము. భర్తలేని స్త్రీ కూడా అంతే. ఆమెది నిస్సహాయ స్థితి. అలాగే నీరులేని బావి లేక కొలను స్థితి కూడా అంతే. భగవంతుని యందు విశ్వాసములేని వారు ఆయన కృపారసాన్ని ఎలా అందుకోగలుగుతారు? కాని పరమాత్ముని

దయ ఆపారమైనది, అనంతమైది, దానికి అవధులు లేవు. సాగరానికైనా అవలి ఒడ్డు ఉంది కాని పరమాత్ముని ప్రేమకి ఆవలి ఒడ్డులేదు. తారకం ఇప్పుడు తెలిసిందా నిజమైన పండితుడు ఎవరో?

కులశేఖర అళ్వార్ దేహము, ఇంద్రియాలు కలిగి ఉన్నా ఇంద్రియదృష్టి లేనివాడు. సంఘంలో ఉన్నా నిస్సంగుడు సాగరంలో వున్నా నావలాటివాడు. గృహస్థాశ్రమంలో ఉన్నా ఏదీ ఆయనను బంధించలేదు. ఇంద్రియాలు ఉన్నా నపుంసకుడై ఉండాలి. అతడే నిజమైన పండితుడు. అటువంటి పండితునికి భగవంతుని మీదగాని కేవలం పరమాత్మ స్వరూపుడైన గురుదేవుని మీద గాని నీచభావాలు కలుగుతాయా? కించిజ్ఞత్వానికి తావు ఉంటుందా? నా పైన దయలేదు. నాతో మాట్లాడటం లేదు. నన్ను అనుగ్రహించటం లేదు అనే భావం కల్గుతుందా? విశ్వాసంలో లోపం ఉంటే అటువంటి భావాలు కలుగుతాయి" అన్నారు శ్రీబాబు.

కర్మ ఎద్దుబండి వంటిదని, జ్ఞానము విమానము వంటిదని, భక్తి రైలుబండి వంటిదని చెబుతారు.

భక్తిమార్గము సులువైన మార్గమని పెద్దలు చెబుతారు. కారణం భక్తి అంటే ప్రేమ.

ప్రేమలేని జీవి ప్రపంచంలో ఒకటీ లేదు. పులిలో కూడా ప్రేమ ఉంటుంది. దాని బిడ్డలపై అది ప్రేమ చూపుతుంది. ప్రేమ అంతటా సహజంగా వుంటుంది.

అయితే యీ ప్రేమ ప్రవాహం సంసార సాగరంలోపడి తన ఔన్నత్యాన్ని పోగొట్టుకుంటుంది. ఈ ప్రవాహానికి వైరాగ్యమనే ఆనకట్ట కట్టి, భగవంతునివైపు మళ్ళిస్తే, మన జన్మలు సార్థకమవుతాయి.

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) -సుషుమ్న ప్రసాద

ఇంద్ర అహల్యల ఉందంతం -

వశిష్ఠ మహర్షి శ్రీరామచంద్రునకు తన ప్రబోధాన్ని కొనసాగిస్తూ, యిలా ప్రవచించారు. "ఓ కమలనయనుడైన రామచంద్రా మనసు, ఆత్మను హతమార్చుటకు కృషి చేస్తుంది. ఈజగత్తంతా మనసు యొక్క కల్పనే. మనసుచేసే క్రియలే నిజమైన క్రియ. భౌతికంగా చేసేవి క్రియలే అనబడవు. పరబ్రహ్మమొక్కడే మనసు యొక్క అద్భుత శక్తులను గ్రహించ గలడు. ఎందుకంటే యీ శరీరాన్ని మనసు తన కల్పనను క్రియా రూపం దాల్చటానికి అనుకూలంగా మలచు కొంటుంది.



మనసు దేహాన్ని గురించి ఆలోచించి, తానే దేహమై పోతుంది. అప్పుడు ఆ దేహంతో బంధింపబడి బాధలను, శోకాన్ని దేహం ద్వారా అనుభవిస్తుంది. జ్ఞాని తాను దేహము కాదని, సర్వ వ్యాపకుడైన పరమాత్మనని గ్రహిస్తాడు. తాను దేహానికి విలక్షణమైన పరమాత్మనని గ్రహించినప్పుడు దేహసంబంధమైన దోషములు, బాధల నుండి విముక్తుడౌతాడు. ప్రేమ లేక కామమైకంలో భౌతిక స్మృతిని కోల్పోయి, భౌతిక బాధల కతీతంగా కామంలో కూరుకు పోయిన ఇంద్ర అహల్యల అనుభవాన్ని వశిష్ఠ మహర్షి వివరించారు. (ఈ ఇంద్ర అహల్యలు దేవేంద్రుడు, గౌతమ మహర్షి ధర్మపత్ని అహల్యకాదు)

ప్రాచీనకాలంలో మగధ రాజ్యాన్ని (ప్రస్తుత బీహారు) ఇంద్రద్యుమ్నుడు అనే రాజు పరిపాలించే వాడు. అతని భార్య అహల్య. ఆ నగరంలోనే ఇంద్రుడనే పేరుగల సామాన్యుడు నివసించేవాడు. అతను నిరాశ, నిస్పృహలకు లోనైన వొక దళానికి నాయకడుగా వుండేవాడు. రాణి అహల్య ఒక సందర్భములో ఆ యింద్రుని చూడటం

తటస్థించింది. అతనిపై వ్యామోహాన్ని పెంచుకొని. అతనితో అక్రమ సంబంధము యేర్పరుచుకొన్నది. కొంతకాలం తరువాత యీవిషయం రాజుగారికి తెలిసింది. వెంటనే ఇంద్రద్యుమ్న మహారాజు ఆగ్రహావేశాలకు లోనై వారిరువురిని, కఠినంగా శిక్షింపదలచాడు.

వారిరువురిని శీతాకాలంలో మంచుగడ్డలు కట్టిన తటాకంలోకి త్రోసివేశారు. కాని వారిరువురూ కించిత్తు కూడా బాధపడినట్లు గోచరించలేదు. వారిరువురు గాఢాలింగనములో మైమరచి పరవశించారు. తరువాత వారిని అగ్నిపై మరిగే నూనె పాత్రలో పడవేశారు. కాని వారు కాలి బొబ్బలెక్కినట్లు గిల గిల తన్నుకోలేదు, పైగా వారు రాజుగారితో యిలా అన్నారు. “ఓ రాజా మేము దైహిక స్పృహ లేకుండా, ఆత్మలేకమై నొకరి నొకరు తలుచుకొంటూ, దివ్యానుభూతిని చెందుతున్నాము.

రాజుగారు వారిప్రవర్తనతో, నిర్విణ్ణులై, ఆగ్రహావేశము యినుమడించి, గజరాజులతో త్రొక్కించి, మర్దన చేశారు కాని వారు యిసుమంతైనా చలించకుండా యిలా అన్నారు “ ఓ రాజా మేము ఒకరి స్మరణలో మరొకరము, అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తున్నాము.”

తరువాత వారిని శూలాలతో పొడిచి, సుత్తులతో బాదారు. కాని ప్రయోజనము శూన్యం. వారిలో బాధపడుతున్న లక్షణాలు యిసుమంతైనా గోచరించలేదు.పైగా చిరునవ్వుతో చిందులాడారు.

రాజుగారు దిగ్భ్రాంతి చెంది, మతి చెలించినట్లైనది. ఆయన అహల్య యింద్రుని యిలా ప్రశ్నించారు. “ఇంత నరకయాతన పెడుతున్నా, మీరుబాధ ననుభవిస్తున్న సూచనలేమి కనబడుట లేదేమ”న్నారు.

రాజుగారికి వారీవిధంగా సమాధానమిచ్చారు. “ఓ రాజా, యెలాంటి నరక యాతన కూడ మమ్మల్ని విడదీయలేదు. మాకీ జగత్తుతో నిమిత్తంలేదు. ఒకరి కొకరిమే మాకీప్రపంచము ప్రతి రూపంలో ప్రతి ఆకారములో నొకరి నొకరం దర్శించుకొంటాము. ఇంద్రునికి అహల్య రూపము, అహల్యకు ఇంద్రుని రూపం తప్ప ఏమి మరొకటి గోచరించదు. మేము అనుభవించే అలౌకికానందములో

దేహాలను పూర్తిగా విస్మరించాము. మేమెలాంటి దైహిక బాధను అనుభవించుటము లేదు. మా శరీరాలను ముక్కలు ముక్కలుగా కోసినా, మేము కించిత్ బాధను అనుభవించము.

మనసు ఒక వస్తువులో లీనమయినప్పుడు, దైహిక బాధను గమనించటానికి, అనుభవించటానికి ఆస్కారములేదు. బాధను అనుభవించటానికి మనసు ఒక పరికరము మాత్రమే. మనసు తనకు నచ్చిన వస్తువులో సంపూర్తిగా లీనమైనప్పుడు, బాధ దానినెలా స్పృశించగలదు? ఈ జగత్తులో యేశక్తి కూడ, మనసును అత్యంత ప్రియమైన వస్తువు నుండి విడదీయలేదు. ఈ శరీరములన్నీ మనసునుండే ఉత్పన్నమవుతున్నవి. మనసు చేయలేని పనంటూలేదు. అదే అన్నిటికంటె ఉన్నతమైన దేహము (సూక్ష్మ దేహం). ఈ శరీరము నశించినా, మనసు తనకు నచ్చిన మరొక నూతన దేహములో ప్రవేశించగలదు. ఆత్మజ్ఞానముతో మనసుకు పునరుత్పత్తి లేకుండా నశింప చేస్తే, శరీరాలు ఉత్పన్నమవటం ఆగిపోతుంది,

వారు చెప్పిన మాటల్లోని వాస్తవాన్ని రాజు గ్రహించారు. రాజ దర్బారులో రాజుగారి చెంత, ఆసీనులైన భరతముని ఆ జంట తీవ్రమైన దైహిక వ్యామోహ ప్రభావానికి లోనయినప్పటికి, వారు పలికిన పలుకులు జ్ఞానభరితమై, ఉన్నాయన్నారు. అంతట రాజు గారు వారిని దేశబహిష్కరణ చేసి, పరాయి దేశంలో వారిని ఆనందము అనుభవించమని వదిలి వేశాడు. వివిధ యింద్రియములతో కూడుకున్న యీ దేహము, మనసు కంటె భిన్నమైనది కాదు.

ఈ విశ్వమంతా మనోమయంతప్ప మరొకటిలేదు. ఎప్పుడైతే మనసు నశిస్తుందో, అప్పుడు శరీరము, జగత్తు అదృశ్యమై పోతాయని చెప్తూ వశిష్ఠ మహర్షి అహల్య యింద్రుల కథను ముగించారు.

-సశేషం

వృత్తి జ్ఞానం వికారశీలమైనది, స్వరూప జ్ఞానం నిత్యమైనది.

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

జనవరి 2014

01 బుధ ఆంగ్ల సంవత్సరాది. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము. భక్తసమారాధన.

11 శని ముక్కోటి ఏకాదశి. శ్రీ సద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము, భక్తసమారాధన.

14 సోమ భోగి. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగసమావేశము, భక్తసమారాధన. రాత్రి 8గం.లకు శ్రీబాబుకు భోగిపళ్ళు పోయటం.

15 మంగళ సంక్రాంతి. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగసమావేశము, భక్తసమారాధన.

16 బుధ పూర్ణిమ. కనుమ. శ్రీసద్గురుపాదపూజ.

21 మంగళ శ్రీత్యాగరాజస్వామి ఆరాధన

26 ఆది శ్రీగురుదశమి. సత్సంగ సమావేశము, శ్రీసద్గురుపాదపూజ.

29 బుధ మాసశివరాత్రి.

ఫిబ్రవరి 2014

06 గురు రథసప్తమి.

8, 9,10,11,12 వరకు పెదనింద్రకొలనులో సత్సంగములు, భక్త సమారాధన జరుపబడును.

10 సోమ భీష్మ ఏకాదశి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం (పెద నింద్ర కొలనుశాఖలో శ్రీ సద్గురుదేవుల దివ్యమంగళమూర్తి దశమవార్షికోత్సవ ప్రతిష్ఠా మహోత్సవము, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన)

14 శుక్ర మాఘపూర్ణిమ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

19 - 22 వరకు కట్టమూరులో సత్సంగసమావేశములు.

24 సోమ శ్రీగురుదశమి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం

27 గురు మహాశివరాత్రి (మాస శివరాత్రి) తె॥జా 3గం.లకు బృందావనంలో శ్రీసద్గురుదేవులకు రుద్ర నమకచమక సహితంగా మహాభిషేకం. 4గం.లకు మహాన్యాసం, 5-30ని॥లకు శ్రీసద్గురు పాదపూజ, 7-30 సామూహిక శివాభిషేకాలు, ఉదయం 11గం. శ్రీరామలింగేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్తసమారాధన, రాత్రి 7గం. శ్రీ మహాకాళికాపరమేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి వారి సామూహిక లీలాకళ్యాణము, అనంతరం శ్రీకళ్యాణ మూర్తుల నగరోత్సవం.

# గురు కృపాహి కేవలమ్

- రమణ ప్రసాద్

1996లో శ్రీ మాతాజీవారు భక్తులను మృత్యుముఖంనుండి కాపాడిన ఉదంతం వెలుగులోకి వచ్చింది - శ్రీ మతాజీవారు తణుకులో జరిగిన సత్సంగ సమావేశంలో " ఏది ఎప్పుడు జరగాలో ఆ గురుదేవుడికి తెలుసు. సర్వ శరీరస్తమైన చైతన్యాన్ని ప్రాప్తింపచేసేవాడే గురుదేవుడు. సర్వ శరీరాలను శరీరిగా ఉన్నవాడు ఆయనే. ఆయనను నమ్మినవాడు బంగారు పిచ్చుక. నమ్మకపోతే బూడిదే" అన్నారు. స్వామి ఈ మాటలను మనస్సులో ముద్ర వేసుకున్నాడు.

తణుకు సత్సంగాలైన తరువాత శ్రీ మాతాజీ పంచారామాలను దర్శించారు. సామర్లకోటలో స్వామిని దర్శించి, కోటిపల్లి వెళ్ళి స్వామిని సేవించి, ద్రాక్షారామానికి వచ్చారు. అక్కడ భీమేశ్వరస్వామిని దర్శించి, పాలకొల్లులో క్షీరా రామలింగేశ్వర స్వామిని అర్చించి కాళీగార్డెన్స్‌కు బయల్దేరారు. ఈ ప్రయాణం అంతా చాలా సరదాగా గడిచింది స్వామికి. ప్రతి క్షేత్రంలో అమ్మ చక్కగా గురుతత్త్వాని, శివ తత్త్వాన్ని వివరించి చెబుతుంటే ఒళ్ళంతా చెవులు చేసుకుని విన్నాడు స్వామి.

తిరుగు ప్రయాణంలో శ్రీ మాతాజీవారి కారు హనుమాన్ జంక్షన్‌లో స్పీడ్ బ్రేకరు దాటుతుండగా"ధన్" అని పెద్ద శబ్దం అయింది. అందరూ ఒక్కసారిగా కలవరపడిపోయారు. ఏదో బాంబు పేలినంత ధ్వని వచ్చింది. శ్రీమాతాజీ వారి కారు డ్రైవ్ చేస్తున్న రాజా కారును ప్రక్కగా ఆపి నాలుగు చక్రాలూ పరీక్షించాడు. అంతా బాగానే ఉంది. కారు క్రింద పరీక్షించాడు. ఎక్కడా ఏ లోపమూ లేదు. మరి ఆ శబ్దం ఎందుకు వచ్చినట్లు? అయినా అనుమానం తీరక స్వామి కారు క్రిందకు దూరి పరీక్షించాడు. మళ్ళీ కారు స్టార్టు చేశాడు. కారు మామూలుగానే స్టార్టు అయింది. ఆశ్రమం చేరేటప్పటికి రాత్రి 9 గంటలైంది. ఏది ఏమైనా కారుని మెకానిక్ షెడ్‌కు తీసుకొని వెళ్ళి చూపించాలనుకొన్నారు రాజా, స్వామి ఇద్దరూ.

కారు దిగి బృందావనంలోకి వెళ్ళబోతూ "కారు ఎప్పుడు షెడ్‌కు తీసుకొని వెళ్తారు?" అని అడిగారు శ్రీ మాతాజీ. " రేపు ఉదయమమ్మా" అన్నాడు రాజా."రేపు ఉదయమా?సరే ఉదయమే తీసుకువెళ్ళండి. జాగ్రత్త! అన్నారు. కారు షెడ్‌లో పెడదామని రివర్స్ చెయ్యబోతే కారు కదలలేదు. అతి కష్టంమీద కారు షెడ్డులో పెట్టారు.

మర్నాడు ప్రొద్దుటే కారును మెకానిక్ మౌలానా షెడ్‌కి తీసుకొని

వెళ్ళారు స్వామి, రాజాలు. జరిగిన విషయం చెప్పారు. " ఈ కారు ఎక్కడ నుంచి తెస్తున్నారు సార్" అని అడిగాడు మౌలానా. రాజా "కాళీగార్డెన్స్ నుంచి" అని చెప్పాడు రాజా.

మౌలానా: నిన్న కారు ఎక్కడ నుంచి వచ్చింది?

రాజా: పాలకొల్లునుంచి.

మౌలానా: పాలకొల్లునుంచి వచ్చాక ఎప్పుడు ట్రబల్ ప్రారంభమైంది?

రాజా: హనుమాన్ జంక్షన్ దగ్గర. అక్కడ స్పీడ్ బ్రేకర్ దగ్గర చాలా పెద్ద శబ్దం అయింది.

మౌలానా: తరువాత మీ ఆశ్రమందాకా మామూలుగా రన్ అయిందా? (అని అడిగాడు ఆశ్చర్యంగా)

రాజా: అవును.

మౌలానా: చెవులో పువ్వులు పెట్టకండి సార్.

రాజా: కాదయ్యా నిజం!

మౌలానా: నాకు 25 ఏళ్ల అనుభవం ఉంది. 'టై రాడ్ ఎండ్స్' విరిగిపోయిన కారు నాలుగు గజాలుకూడా నడవదు. ఒకవేళ నడిస్తే ఆ కారు స్టీరింగ్‌కు, చక్రాలకు సంబంధం ఉండదు.

"ఏమిటీ!" అంటూ ఎగిరి పడ్డారు స్వామి, రాజాలు. "టైరాడ్ ఎండ్స్ రెండూ విరిగిపోయి ఉన్నాయి." అన్నాడు మెకానిక్. మరి ' టై రాడ్ ఎండ్స్' విరిగిన కారు హనుమాన్ జంక్షన్ నుండి ఎలా వచ్చింది? త్రోవలో ఎన్నో మలుపులు! ఏదైనా పొరపాటు జరిగితే తామూ, అమ్మా... ఇంక మనస్సు ఆలోచించటానికి నిరాకరించింది. మెకానిక్ ఇలా అన్నాడు "సార్! మీరు హనుమాన్ జంక్షన్ నుంచి ఆశ్రమందాకా రావటం జరగటానికి వీలు లేదు. ఇప్పుడు మీరు ఆశ్రమం నుంచి తీసుకుని రావటంకూడా విచిత్రమే. మీరెప్పుడూ మీ గురువుగారిని గురించి చెబుతారు కదా! ఇది ఆయన మహాత్మ్యం అయి ఉంటుంది. " అల్లా మాలిక్" మాత్రమే ఇటువంటి పనులు చేయగలడు." అన్నాడు మెకానిక్ మౌలానా.

స్వామికి కారును పరీక్షగాచూస్తూ "రేపు ఉదయం తీసుకువెళ్తారా" అని లో గొంతుకతో అనుకొంటున్న అమ్మ మాటలు గుర్తుకొచ్చాయి. "సరే ఉదయమే తీసుకు వెళ్ళండి జాగ్రత్త!" అని రాజాకు చేసిన హెచ్చరికకు అర్థం ఇప్పుడు తెలిసింది."అమ్మా! ఇలా కాపాడావా తల్లీ! అంతా నీ దయ!" అని మనస్సులోనే నమస్కరించుకొన్నాడు స్వామి.

# పరి ప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

సాధన పరిపక్వత చెందాలంటే దేహభావన తొలగిపోవాలి. ఇంద్రియ సంయమనం పాటించాలి. ఈ రెండూ యదార్థమే కాని గృహస్థాశ్రమంలో ఉండి యీ రెండిటిని వీడి సంసార యాత్రని కొన సాగించటం సాధ్యమా? అన్న విషయం చర్చకు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీ సద్గురుదేవులు భక్తులకు చక్కని సందేశాన్ని అందజేశారు.



“ఇంద్రియాలు బహిర్ముఖమై ఉన్నాయి. మనసు మాత్రం లోపల ఉందని భావించండి. ప్రతి సాధకుడు యీ రెండిటి ఘర్షణలో ఉండక తప్పదు. మనస్సు యింద్రియాలతో కూడి బహిర్ముఖమై శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకు స్పందిస్తుంది. ఇది సహజ లక్షణం సుమా! శరీరం ఒక పరికరం. శరీరం నీకు ఆవాస క్షేత్రం. దీన్ని ఉపయోగించుకుని సాధించవలసినదేమిటి? అని విచారణ చేయాలి.

అటువంటి విచారణ సద్గురుమూర్తిని ఆశ్రయించిన సాధకులకే సాధ్యపడుతుంది. అన్యులకి అది లభ్యం కాదు. ప్రాపంచిక విషయాలు శాశ్వతం కాదు. ఒకసారి ఉన్నట్లు మరొకసారి ఉండక పోవచ్చు. నీ శరీరాన్ని సక్రమంగాగాని, అక్రమంగాగాని వాడుకుని వదిలి వేయక తప్పదు. ‘నాకు యీ దేహంతో ఎంతవరకు సంబంధం?’ అని ప్రశ్నించుకోవాలి. ప్రపంచంలో ఎంత గొప్పదానిని సాధించినా దాన్ని వదల వలసినదేకదా! దాన్ని గుర్తించాలి. ఏదీ మిగలదు. ఆ భావనే విలక్షణత్వం.

శరీరాన్ని శాశ్వతానందం పొందటానికి వాడుకోవాలి. లోకంలో ఏదీ నీ స్వంతం కాదు. ఈ జీవితాన్ని భగవానుడు ప్రసాదించాడు అనే భావన కలగాలి. చూసేది, వినేది, రుచి చూసేది, వాసన చూసేది నేను. నేను శరీరం కాదు. అది వాస్తవిక దృష్టి. నేను శరీరానికి విలక్షణం. శరీరం మోక్షసాధనం. లోకంలో ఎన్నో వదిలిపెడుతున్నాడు సాధకుడు.

నువ్వు దేన్నీ బలవంతంగా వదలవలసిన పనిలేదు. విచారణ ద్వారా అవే నిన్ను వదిలిపెడతాయి. పెరుగు కుండలో కవ్వం కదిలితేనే వెన్న లభిస్తోంది. అలాగే మన సాధన మన విచారణ మీద ఆధారపడి ఫలిస్తుంది. ఇంద్రియాలతో కూడినది శరీరం. ఇంద్రియాలకీ, శరీరానికీ ఆధారమైనది ఒకటున్నది. అది అశరీరి. దాన్ని గుర్తించాలి. విచారణ ద్వారా గృహస్థాశ్రమంలో ఉన్నా, సాధకుడు సద్గురుమూర్తి అనుగ్రహంతో తప్పక దేహభావన తొలగటమేకాక, ఇంద్రియ సంయమనాన్ని పాటించ గలుగుతాడు.

# తెలిసింది! తెలిసింది!

-పెనుమాక నాగేశ్వర రావు

వింటే తెలిసిందీ, విన్నాకే తెలిసింది
గురువే దైవమనీ, గురుమూల మిదం దైవమనీ ॥వింటే॥

అంటే తెలిసిందీ, అన్నాకే తెలిసింది
గురునామమే మధుర మధురమనీ
ఆ నామమె తారకమంత్రమనీ ॥అంటే॥

ఉంటే తెలిసిందీ, ఉన్నాకే తెలిసింది
గురుసన్నిధి పెన్నిధనీ, ఆ పెన్నిధె పరమావధనీ ॥ఉంటే॥

చూస్తే తెలిసిందీ, చూశాకే తెలిసింది
గురు రూపమే రమ్యమనీ, ఆ రూపమే అపురూపమనీ ॥చూస్తే॥



# శ్రీకృష్ణ కర్ణామృతము

గత సంచిక తరువాయి

– సుశీలా ప్రసాద

ఒకనాటి అద్భుతం వాళ్ళని కదిలించివేసింది. నందబాలుడు నదిలో దూకాడని విషసర్పమొకటి వానిని చుట్టేసిందని విన్నవారంతా నది ఒడ్డుకి పరుగులు తీశారు. జరిగింది విని యశోదమ్మ గుండ పగిలేలా ఏడుస్తూంటే చుక్కమ్మకి తనబిడ్డ గుర్తొచ్చి కడుపు చెరువైంది. అయితే ఆమె బిడ్డ సామాన్యుడు కాదని తమందరినీ కాపాడ వచ్చిన దేముడని, అందరూ తెలుసుకుని ఆనందసాగరంలో ఓలలాడుతుంటే సింగన్నకి చుక్కమ్మకి అనిపించింది, తమ బిడ్డనికూడా రక్షించి తమకి దక్కిస్తే ఎంత బాగుండెనని! అప్పటికే తమకి ఏళ్ళుగడిచాయి కదిలే ఓపిక కూడా దిగులుతో నశించి పోతున్నది. అలాగ జరుగుతున్న కాలంలో ఒకనాడు, తమజీవితంతో మరుపు రాని మరీ అద్భుతం జరిగిన రోజు సింగన్న మనస్సులో మెరిసింది.



ఆనాడు యిలాగే జోరుగా వర్షం కురుస్తు అది క్రమంగా భయంకరంగా మారిపోయింది. వడగళ్ళు విసిరి విసిరి పడుతున్నాయి. తమ పూరింటి కప్పుఎప్పుడెగిరి పోతుందో, ఇల్లు కూలిపోతుందోనని గుండెలు గుప్పిట్లో పెట్టుకున్నారు.

అంతలో తాటాకుల గొడుగు వేసుకుని, ఆ పిల్లవాడు యింట్లో అడుగు పెట్టాడు. "లే తాతా! అవ్వా లే అమ్మా!" అంటూ వారిద్దరి చేతులు తన చేత్తో కలిపి పట్టుకుని ఒక చేత్తో గొడుగు పట్టుకుని బైటకి నడిపించుకుని వెళ్ళాడు. తక్షణం పాక కూలిపోయింది. తామిద్దరినీ అంత జాగ్రత్తగా గట్టిగా పట్టుకునేందుకు ఆ చిన్నారికి అంత బలం ఎక్కడుందో తెలియలేదు వాళ్ళకి. కళ్ళమీద వానపడుతుంటే కనులు మూసుకున్న వారిద్దరూ మళ్ళీ కళ్ళు తెరచి చూసే సరికల్లా పెద్ద రాతి గొడుగు కింద ఉన్నారు. తామే కాదు ఇంకా చాలా మంది జనం, గోవులు కూడా నిండి ఉన్న ఆ అందరి మీద ఒక్క చుక్క కూడా వాన మీద పడకుండా అంతా క్షేమంగా ఉన్నారు.

సింగన్న వింతగా ముందుకి చూశాడు. అది పెద్ద కొండ. దాన్ని

చిటికిన వేలి మీద గొడుగులా పట్టుకున్న ఆ చిన్నారి ముద్దు బాలుడు ఎవరు? గుర్తించాడు సింగన్న తమని గొడుగులోకి తెచ్చినవాడు, నదిలో దూకినవాడు, నందయ్య ఇంట్లో తిరుగాడుతూ నవ్వుల మరిపించే అందాల కన్నయ్య! సింగన్న చుక్కమ్మ చేతులు రెండూ తన చేతులతో కలిపి తలవంచి మొక్కాడు. నిజమే అతగాడు దేముడే! అప్పట్నించీ సింగన్న తరుచుగా "కన్నా" అని పిలుస్తూ మనస్సులో వానిని తలుస్తూనే ఉన్నాడు.

తమ బిడ్డని తమకి తిరిగి యివ్వగల శక్తి వానికిలేదా? ఇదంతా ఆలోచిస్తూ సింగన్న చేతులు జోడించి "కన్నా! నువ్వు దయా సముద్రుడివే నీ కరుణని నాపై కురుపించి నా బాధ తీర్చ లేవా! గొంతెత్తి బిగ్గరగా మొరబెట్టుకుంటున్న నన్ను రక్షించు" అని ప్రార్థిస్తున్న వేళ, వాన తగ్గినట్టుంది. తడిక తలుపు తీసిన చప్పుడైంది. సింగన్న అటు చూశాడు. ఎవరో విలువైన వస్త్రాలు ఆభరణాలు ధరించిన శ్రీమంతుడు ఇంట్లోకి వచ్చాడు, వాని వెనుక మరొకడు. సింగన్న త్వరగా లేచి "రండి బాబూ! ఎవరికోసం వచ్చారు?" అంటూ ఒక ముక్కాలి పీట ముందుకు జరిపి 'కూర్చోండి' అన్నాడు. రెండో వ్యక్తి చుక్కమ్మ పరున్న మంచం మీద కూర్చున్నాడు.

"మాది మధురానగరం" అంటూ మొదలు పెట్టాడు ఆ గొప్పవ్యక్తి సింగన్న వింటూ ఉండిపోయాడు. "కొంతకాలం క్రిందట ఎంతంటే మా ఆనందంలో కాలం గుణించలేక పోయాము. ఆనాడు నేను గుర్రమెక్కి నగర వీధులలో తిరుగుతున్నప్పుడు చాలా ఇరుకుగా జన సందోహం నిండి ఉన్న బాటలో ఎడ్ల బళ్ళ మధ్యలో బండిలోంచి జారి పోతూ ఏడుస్తున్న ఒక బాలుడు నాకు కనిపించాడు. మరోక్షణానికి వాడు జారిపడితే వేగంగా అటే వస్తున్న గుర్రంవానిని తొక్కి వేసేందుకు సిద్ధమైనపుడు, నేను ఆ బాలుని వేగంగా నాగుర్రంమీదకి లాక్కుని ఆ చోటినించి తప్పించి ముందుకి తీసుకెళ్ళి పోయాను. అక్కడాగి బాలుని ఎవరు బాబూ! అని అడిగినా పిల్లవాడు చెప్పలేకపోయాడు. వెనక్కి వచ్చి చూసినా బళ్ళన్నీ కలగా పులగంగా కలసిపోయి నేను గుర్తించలేక అయోమయమై పోయింది నాకు. వెంటనే మా ఇంటికి తీసుకు వెళ్ళిపోయాను.

-సశేషం

(గత సంచిక తరువాయి)

# సర్వము నీ దయ

- సుశీలా ప్రసాద

న్యాయ నిర్ణయ మందిరంలో అడుగు పెడుతూనే శ్రీవర్ధనుడు తల ఎత్తి చూశాడు. తను తరచుగా నేరవిచారణ జరపటానికి ఆసీనుడయ్యే సింహాసనం, ఆ దిగువుగా మరొక రత్నాసనం పైన అప్సరసవలె వెలిగిపోతూ మహారాణి సుఖాసీనురాలై ఉంది. అమాత్య శేఖరులూ తదితర సామంతులూ తమ తమ ఆసనాలలో చుట్టూరా కూర్చుని ఉన్నారు. శ్రీవర్ధనుని దృష్టి వీటన్నిటినీ దాటి పోయింది. క్రమంగా అప్పుడు అతని నేత్రాలు రెండూ సింహాసనంపైన ఉన్న మూర్తి మీద నిలచిపోయాయి. తన స్థానాన్ని మరొక వ్యక్తి ఆక్రమించి ఉండటం చూసిన రాజుకి పరమాశ్చర్య విభ్రమాలు కలిగాయి. తనవలెనే రాజదుస్తులు ధరించి కిరీట ధారియై చేత దంతపు న్యాయదండం పట్టుకున్న ఆ అపరిచిత వ్యక్తికి సభంతా పూర్తి గౌరవ మర్యాదలను నెరుపుతున్నది. ఇతరులందరికీ ఆ వ్యక్తి తమ చక్రవర్తి శ్రీవర్ధనుడనే అనిపిస్తున్న కారణం ముమ్మూర్తులా తనని పోలి ఉండటమే. వంచితుడైన చక్రవర్తి యీవిధంగా అయోమయావస్థలో ఉండగా ఆ నూత్న విచిత్ర వ్యక్తి స్పష్టమైన కఠిన కంఠస్వరంతో మాట్లాడ సాగాడు. “ఈ వ్యక్తేనా రాజమర్యాదను అల్లరి చేస్తున్నది?”

శ్రీవర్ధనుడు స్థిరంగా తానే జవాబు చెప్పటానికి నిశ్చయించుకొని “నేను అసలు చక్రవర్తిని. కిందటి రోజున యీమంత్రి సామంతాదులంతా నాకు సేవను చేశారు. ఈ రోజు అతి విచిత్రంగా నా స్థానం ఆక్రమించిన నీకు చేస్తున్నారు, కాని యావత్ప్రంచమూ ఎదురు తిరిగినా, నా యీ కష్ట భూయిష్టమైన జీవితం అంతమైనా ఏమైనా సరే కనీసం నాపేరును మటుకు నేను ఉచ్చరించక మానను. నేను సకలైశ్వర్య సంపన్నుడనైన శ్రీవర్ధన చక్రవర్తిని, నాకు సాటిగలవారెవరూ లేరు.”

“నీ ప్రసంగ ధోరణి నీ పిచ్చితనాన్ని ఋజువు చేస్తున్నది. నీ యీ వ్యతిరేక ప్రవర్తనకు కఠిన దండన విధించాలి. కాని నీకు శిక్ష విధించక పూర్వమే, నీమనస్సుకి తృప్తి కలగటంకోసం మన ఇద్దరిలో నిజమైన చక్రవర్తి ఎవరో ఇక్కడ ఉన్న మహారాణి మంత్రులు, సామంతులు, నిర్ణయించి చెబుతారు. ఓ గౌరవనాయులైన అమాత్య వర్యులారా! సామంతులారా! మా ఇరువురిలో సత్యమైన చక్రవర్తి ఎవరో గుర్తించి నిర్ణయించి చెప్పండి! ” ఆ వ్యక్తి గంభీర స్వరం మేఘ గర్జనలా వినరాగా, ఆ ధ్వనికి ఆనందం పొందే మయూరాలవలె సభికులంతా మరుక్షణమే సింహాసనం వంకకు తిరిగి “శ్రీవర్ధన చక్రవర్తి మీకు జయమగుగాక! మహారాజా జయము జయము”

అంటూ ముక్త కంఠాలతో పలికారు. ఆ వెంటనే మహారాణి మెరపు తీగెలాలేచి సింహాసన సోపానాలనధిరోహించి నానాభరణ భూషితుడైన ఆ వ్యక్తి పాదాల ముందు మోకరించి నమస్కరించి "మీ సహ ధర్మచారిణినైన నాకు మీరే సత్య శ్రీవర్ధన చక్రవర్తులని మనః పూర్వకంగా తెలుసును" అని నిశ్చయించి చెప్పింది. ఆ మాటలు వింటూ శ్రీవర్ధనుడు నిశ్చేష్టుడైనాడు.

"ఈ సమాధానాలు విన్నావుకదా! ఇప్పుడు మాదేశ న్యాయ సూత్రాలను అనుసరించి నీకు మరణశిక్ష విధించాలి. నీవు గనుక మాముందు మోకరిల్లి నీ తప్పులన్నిటినీ ఒప్పుకున్నట్లయితే నిన్ను ఏ శిక్షా విధించకుకండా వదిలి వేస్తాము". అంటూ ఆవ్యక్తి చురుకు చూపులతో ప్రశ్నార్థకంగా శ్రీవర్ధనుని వంకకు చూశాడు. శ్రీవర్ధనుని ముఖంలో నిరాశా దైన్యము మాయమై కోపంతో ఎర్రబడింది. "ఎన్నటికీ అలా జరగదు. మీ ఆజ్ఞలకి లోబడటం కంటే నీ చేతులలో మరణించటమే నాకు సమ్మతం. నేను ఇతర మానవులకంటె ఉత్కృష్టమైన జన్మ ఎత్తిన వాడిని. వినయంతో వంగి నమస్కరించటానికి నేను అంగీకరించను."

"కొత్త వ్యక్తి, రాజు వంకకే చూస్తూ కొంతసేపు ఆలోచనా పూర్వకంగా కూర్చున్నాడు. అతని ప్రశాంత లలాటంమీద కఠినత్వం కొద్దిగా తొలిగి ఆశ్చర్యం ప్రకటితమైంది. వెంటనే నిశ్శబ్దాన్ని తొలగిస్తూ " నేను చెప్పినట్లుగానే జరగాలి. మాచేతులతో నీకు శిక్ష విధించము. కాని నీవు నీవ్యర్థపుటాలోచనలు మానివేసి నిరాడంబరంగా వినయవిధేయతలతో న్యాయబుద్ధి గలవాడవై జీవించటం నేర్చుకో " అంటూ తీక్షణమైన చూపులను శ్రీవర్ధనుని పైన ప్రసరింప చేశాడు. శ్రీవర్ధనుడు బాధా నిస్పృహలతో తల వంచుకున్నాడు. తనను ఎవరైనా గుర్తిస్తారేమోనని క్షీణిస్తున్న ఆశాజ్యోతి చివరి ప్రకాశం వలన శ్రీవర్ధనుడు మరోసారి తన పరిచితులందరి వైపూ చూశాడు. అతనికి కొద్ది అడుగుల దూరంలోనే ఉన్న సేనాధ్యక్షుడు, రాజ కోశాధికారి, ప్రధానామాత్యుడు తనని బాగా ఎరిగిన సామంతులు చివరికి మహారాణి కూడా రాజ విరోధి అనిపించుకున్న తన వైపు చూడకుండా ముఖం తిప్పుకొని సింహాస నాసీనుడైన వ్యక్తి ఆజ్ఞా పాలన కోసం ఆయన వంకే శ్రద్ధా భక్తులతో కనురెప్ప వేయక చూస్తున్నారు. శ్రీవర్ధనుని హృదయంలోని ఆశాజ్యోతి ఆరిపోయి గాఢాంధకారం నిండి పోయింది. కొద్ది క్షణాలలోనే రాజాజ్ఞ పైన రాజ భటులు శ్రీవర్ధనుని మందిరం బైటకు తీసుకు పోయారు. తన భవనంలోనే తనకి అంత తిరస్కారమూ అవహేళన జరిగాక శ్రీవర్ధనుడు ఏమి జరుగుతున్నదీ గమనించ లేని స్థితికి వచ్చేశాడు.

-సశేషం

# బ్రహ్మ కడిగిన పాదము

– వశిష్ఠ

హరేరామ హరేరామ అనే నామం చేసినంత మాత్రాన చాలదు. మనసు దానిపై నిలవాలి. అప్పుడే అది అంత్యకాలంలో నిలబడుతుంది. అంత్య కాలంలో నిలబడితే మోక్షమే.

చిలుక 'రాం, రాం' అని ఎన్నోసార్లు పలుకుతుంది. కాని, మార్జాలం పీక పట్టుకున్నప్పుడు సహజ స్వభావంతో 'కీర్, కీర్' అంటుంది. 'రాం రాం' అంటే మోక్షం, 'కీర్ కీర్' అంటే నరకం. అంత్యకాలంలో జీవుడు పడే బాధ వర్ణనాతీతం. అట్టి మరణావస్థలో కూడా 'హరేరామ నామం' స్మరించాలంటే జీవితకాలం దాన్ని అలవాటు చేసుకోవాలి.



ఒకసారి శ్రీరంగ పట్టణంలో రామతీర్థులు గీతపై ఉపన్యాసం యిచ్చారు. అనేకవేల మంది పండితులు, విద్యావంతులు భగవద్గీత పుస్తకాలతో వచ్చారు హస్త భూషణంగా. ఉపన్యాసం జరిగినంత సేపూ కొందరు కునికిపాట్లు పడ్డారు. కొందరు సంస్కృతపద ప్రయోగాన్ని, కొందరు విభక్త దోషాన్ని విమర్శించారు. ఒక్కడు మాత్రం సభలో ఒక మూల ఆనంద బాష్పాలతో తన్మయుడై కూర్చుని ఉన్నాడు. ఉపన్యాసం అంతా అయింది. అందరూ వెళ్ళారు. అతను కదలలేదు. రామతీర్థ తన శిష్యులకు అతన్ని చూపి, 'ఇన్ని వేలమంది భక్తులలో యితడు ఒక్కడే గీతాసారమును గ్రహించిన వాడు. గీతాచార్యుని దర్శిస్తూ అతను పొందే ఆనందం చూడండి.' అన్నాడు.

అలా మనసు భగవానుని యందు నిలిచినప్పుడే ఆనందం లభిస్తుంది. రేడియోలో బెజవాడ స్టేషన్‌లో జరిగే పాట కచేరీ వినాలంటే ముల్లు సరిగా ఆ స్టేషన్ నెంబరు మీద నిలిపితేనే ఆనందం లభిస్తుంది. ముల్లు వెంట్రుకవాసి పక్కకు జరిగినా, బర్ర్ మని శబ్దమో, అక్కర్లేని మరో స్టేషనో వచ్చి బాధిస్తాయి.

మోక్షానుభూతి చనిపోయిన తరువాతకాని కలుగదని కొందరు అంటారు. చచ్చిన తరువాత బూడిద తప్ప మరేమీ మిగలదు. బ్రతికి

వుండగానే, ఈ శరీరంతో పొందిన మోక్షానుభూతియే నిజమైన అనుభూతి. జ్వరమొస్తే వేడిని, బాధను శరీరంపై ఎలా అనుభవిస్తామో, మోక్షానందాన్ని అంతస్పష్టంగా యీ శరీరంతోనే అనుభవించాలి. అది గురుకృప వలనే సాధ్యము. ఆ గురుకృప వలన నల్లని మసిబొగ్గు తెల్లని బూడిదగా మారినట్లుగా మలినమనసు, శుద్ధమనసుగా మారుతుంది.

ఒక గురువుగారు తన శిష్యులకు బొగ్గులు యిచ్చి దానిలో ఒక స్వచ్ఛమైన తెల్లని పదార్థం ఉన్నదని, ఆ బొగ్గుల నుండి దాన్ని సాధించి తెమ్మని పంపారు. నీళ్లతో ఒకరు, పాలతో ఒకరు, పంచామృతాలతో ఒకరు యిలా తొలకరూ తలొక రకంగా కడిగారు. ఆ పాలు, పంచామృతాలు, నలుపెక్కాయి. కడిగినవారి చేతులు మలినమయ్యాయి. కాని, బొగ్గు రంగు మారలేదు.

ఒక శిష్యుడు మాత్రం గురువు చెప్పిన “జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణి” అన్న గీతావాక్యం గుర్తుంచుకుని, ఆ బొగ్గును అగ్నితో కాల్చి, శుద్ధి చేసి, తెల్లటి విభూతిని సాధించి చూపాడు. అతడు నిజమైన శిష్యుడు.

అలా గురువాక్యాలను గుర్తుంచుకుని ఏకలవ్య భక్తితో అనుష్ఠించిన శిష్యుడు ధన్యుడై తరిస్తాడు. అట్టి శిష్యుని చూసి గురువు ఆనందిస్తాడు. శిష్యుడు తన బోధావాక్యాలను గుర్తుంచుకుని ఆచరించి, ఆనందాన్ని పొందినప్పుడు తిరిగి ఆ బోధామృతాన్ని, ఆ ఆనందాన్ని అందరికీ అందిస్తున్నప్పుడు చూసి సంతోషించేవాడే సత్యగురువు. అంతేకాని శిష్యుని ధనధాన్యాలతో, సేవలతో అతనికి పనిలేదు.

బొగ్గువంటిది యీ పరిణామశీలమైన జగత్తు. దానిలో స్వచ్ఛ పదార్థమే పరిణామ రహితమైన ఆత్మవస్తువు. ఈ జగత్తులో, యీ సంసారంలో మసులుకుంటూనే వ్యాపించి ఉంది. దాన్ని ప్రకాశింప జేస్తూ స్వయం ప్రకాశమై ఉండే ఆత్మవస్తువును యీ జన్మలోనే, ఈ కన్నులతోనే, మీరందరూ దర్శించాలని, ఆ ఆనందాబ్దిలో ఓలలాడి, తరించాలని మీ హృదయ బాబు ఆకాంక్ష!.

# శివాలయ మహత్తు

- కామేశ్వరీ ప్రసాద

ఓ తపోధనులారా! నిత్యమూ శివాలయమును, తుడిచి, సమ్మార్జనము (తుడిచి, పరిశుభ్రం) చేసినవారు యావజ్జీవము ఇహలోక పరలోక సౌఖ్యాలను పొందుతారు. అత్యంత భక్తితో సదాశివుని ధ్యానించినవారు, తన వంశమున కోటిమందిని తీసుకుని తనతో పాటు శివసాయుజ్యమును పొందుతారు. ఇందుకు ఉదాహరణగా ఒక కథను సూతులవారు చెప్పారు. ఆ కథయే ఇంద్రసేన మహారాజు కథ.

సత్యయుగంలో పూర్వం ప్రతిష్ఠా నగరములో ఇంద్రసేనుడు అనే మహారాజు ఉండేవాడు. అతడు పరమ మూర్ఖుడు. ఎప్పుడూ సప్త వ్యసనాలలలో మునిగి, క్రూరుడై, దురాశాపరుడై, ఇతరులను బాధిస్తూ ఉండేవాడు. ఎంతవెతికి చూసినా వానిలో ఒక్క సుగుణము కూడా కనిపించేదికాదు.

'యథారాజా తథాప్రజా' అన్నట్లు అతని రాజ్యంలో ప్రజలు కూడా అంతే. ఆయన అనుచరులు కూడా దుష్టపనులే చేస్తూ ఉండేవారు. ఆ రాజు చాలకాలం పరిపాలించి తరువాత మరణించాడు. వెంటనే యమ కింకరులు వచ్చి, వానిని కొట్టి, నరకానికి తీసుకునిపోయి యమధర్మరాజు ఎదుట నిలబెట్టారు. అప్పుడు యముడు వాని బంధనములను విడిపించి, రాజుతో "ఓ! ఇంద్రసేనా! ఇంతకాలం నుండి ఏఏ పుణ్యకార్యాలను ఆచరించావో దానికి తగిన పదవిని పొందుతావు" అన్నాడు.

"యమధర్మరాజా! నేను చేసినవన్నీ పాపాలే. కాని పుణ్య కార్యాలు ఏమీ లేవే" అన్నాడు ఇంద్రసేనుడు.

"నీవు చేసిన పాపాలు ఏమిటి?" అని ధర్మరాజు ప్రశ్నించాడు.

"నేను చేసిన పాపాలను లెక్కపెట్టగలనా? పుట్టి బుద్ధిఎరిగిన మొదలు నేను చేసినవన్నీ చెడ్డపనులే. పుణ్యమన్నది ఒక్కటీ లేదు" అన్నాడు. దానికి ధర్మరాజు "నీవు చేసినవన్నీ పాపాలే అయినా ఈశ్వరుణ్ణి స్మరిస్తూనే చేశావు. నీవు ఆహార విహార సమస్త కర్మలను కూడా శివార్పణ బుద్ధితో చేశావు." ఇంద్రసేనుడు "ఏమో! అది నాకు తెలవదు. బుద్ధి పూర్వకంగా మాత్రం చేయలేదు" అని సమాధానం చెప్పాడు.

"ఏది ఏమైనా సరే దాని ఫలితాన్ని ఇప్పుడు నీవు అనుభవించాలి" అన్నాడు ధర్మరాజు. ఇంద్రసేనుడు "దానికి ఇప్పుడు ఏమనుభవించాలి?" అని అడిగాడు. "నీవు చేసిన సకల కార్యాలు కూడా శివార్పణచేశావు కాబట్టి నీకు శివసాయుజ్యమును పొందవలసి ఉన్నది" అన్నాడు.

"ఎంతకాలం ఉండాలి అక్కడ?"

"ఆ చంద్రార్కాము అక్కడే ఉండాలి"

"అయో! ఎంత కష్టమో! ఎంతకష్టమో! అంతకాలం నేను ఒకేచోట ఉండలేను."

"ఓరి వెఱ్ఱివాడా! అదేమి బాధకాదే! అక్కడ ఆనందము తప్ప వేరేమీ ఉండదు" (ఇంతలో శివదూతలు వచ్చి) "ధర్మరాజా! ఇంద్రసేనుడు యిక్కడ ఉన్నాడా?" అని అడిగారు.

"అయ్యలారా! ఇంద్రసేనుడితో మీకేమి పని?"

"ఇంద్రసేనుడు భూలోకంలో తన శరీరమును విడిచి పెట్టినట్లు మా ప్రభువుకు తెలిసింది. వెంటనే వానిని మా లోకానికి తీసుకురమ్మని ఆదేశించారు. అందుకే మేము అక్కడకి వెళ్ళి చూస్తే, అక్కడలేడు. వెతుకుతూ ఇక్కడకి వచ్చాము" అన్నారు శివదూతలు.

"ఇదిగో! ఇంద్రసేనుడు. వీనిని మీలోకానికి ఎలా తీసుకెడతారు?" అని అడిగాడు. "అదిగో! విమానం. దానిలో తీసుకెడతాం" అన్నారు. "సరే! ఇంద్రసేనా! వీరితో కలసి శివలోకానికి వెళ్ళు" అన్నాడు ధర్మరాజు.

శివదూతలు వానిని విమానంలో కైలాసానికి చేర్చారు. ఈశ్వరుడు వానిని ఆహ్వానించి, కౌగలించుకుని, తన ఆస్థానానికి తీసుకుని పోయి, తన ప్రక్కనే కూర్చోబెట్టుకుని, అతని అభీష్టాలను అడిగి తెలుసుకుని, 'శివచందు' అనే పేరుపెట్టి, తన దగ్గరే ఉంచుకున్నాడు. పరమ కలుషాత్ముడైన ఇంద్రసేనుడు అప్రయత్నంగానైనా సరే సదాశివుని స్మరిస్తూ తాను చేసిన సర్వ దుష్టకర్మలు శివార్పణ చేయటంతో వానికై ఇక ఏ పాపాలు అంటక కర్మలన్నీ నశించి, శాశ్వత శివ సాయుజ్యం లభించింది" అని సూతులవారు చెప్పారు.

నిరంతరం శివ నామస్మరణ చేసేవారు తమ పాపాల ఫలితాన్ని పొందకుండా మోక్షాన్ని పొందుతారు అని తెలియజేశాడు.

# సంక్రాంతి

-R.T.C లక్ష్మి

ఆహ్లాదకరమైన యీ హేమంత ఋతువులో ఎన్నో, ఎన్నెన్నో అభ్యుదయకరమైన విశేషాంశాలు మనసుకి ఆనందాన్నీ, నూతనోత్తేజాన్నీ కలుగజేస్తాయి. ఈ ఋతువులోనే సంక్రాంతి పండుగ వస్తుంది. సంక్రాంతి అంటేనే సంయక్ క్రాంతి అని అర్థం. కాంతి అంటే వెలుగు. క్రాంతి అంటే విజ్ఞాన పూరితమైన ఒక ఉత్తేజకరమైన ప్రకాశం అనవచ్చు.

'ఓ కాత్యాయనీ! భగవతీ!' అంటూ గోపకుమారికలు ప్రార్థించి నియమ నిష్ఠలతో శ్రీకృష్ణుని మగనిగా ప్రసాదింప వలసిందిగా పూజలు చేసి, ఏదో చిన్న చిన్న దోషాలను కృష్ణుని నిర్దేశంలోనే సరిదిద్దుకొని కృష్ణునిచే వలపించుకున్నారు గోపకుమారికలు. భోగి భోగశయనుడైన మాధవుని మనసారా తలచి-వలచి, ఆ తలపులలో నిలిచిపోయారు. ఆ గోపికలు జ్ఞాన వస్త్రాలు పొందిన రోజునే 'భోగి' అని శ్రీగురుదేవులు తెలియజేశారు.

ప్రకృతి-పురుషుల దివ్యలీలయే కాలము. కాలశ్చ నారాయణ అని మనం కాలాన్ని భగవత్స్వరూపంగా భావిస్తాము - పూజిస్తాము. కాలము నారాయణ స్వరూపమైనప్పుడు ఆ కాలంలో కలిగే ఆ'కాలం' కలుగ జేసే ఫలితాలను లక్ష్మీ స్వరూపంగా ప్రకృతి స్వరూపంగా భావిస్తాం కదా! ప్రకృతి పరంగా కూడా ప్రతి యింటా పాడి-పంటలతో, బంధు-మిత్రులతో, ఆనంద నందనంగా కోలాహలంగా ఉంటుంది. రంగురంగుల రంగవల్లులు బంతి-చేమంతి తోరణాలు, క్రొత్త కోడళ్ళు - క్రొత్త అళ్ళుళ్ళు, పసిపిల్లల బోసి నవ్వులు, బోగిపండ్లతో యింటింటా సమ్యక్ క్రాంతే. అదే 'సంక్రాంతి'

పశువులకు కూడా ఆ పండుగకు సెలవు యిచ్చి, అనగా ఎద్దుల చేత పని చేయించకుండా వాటిని శుభ్రపరచి, అలంకరించి వాటిని కూడా పండుగలో భాగం పంచటం మన భారతీయుల సునిశిత సున్నిత మనస్సుకి చిహ్నం ఆ రోజు 'కనుమ'.

ఇందులో పితరులకి కూడా, పితృఋణం నుంచి మనం విముక్తుల మవడం - వారిని తరతరాలుగా తలచుకొని వారి కుంటుంబంలో మనకి స్థానమిచ్చి, తమ రక్త మాంసాల ద్వారా సంస్కారాన్ని- ప్రేమతో పంచి యిచ్చి మనలను తీర్చిదిద్దిన పెద్దలకు కృతజ్ఞతగా అనేక దానధర్మాలు చేస్తారు.

జ్ఞానాజ్ఞాన కృతమైన అనేక దోషాలకి ప్రాయశ్చిత్తంగా, భవిష్య జీవితం ఆనంద ప్రదంగా ఉజ్వలంగా ప్రకాశించడానికై కూష్మాండాది సువర్ణ దానాలెన్నో యీ సంక్రాంతి సందర్భంగా ఆచరించటం చూస్తాము.

సూర్యుడు ధనస్సురాశి నుండి మకరరాశిలో ప్రవేశించే శుభవేళ యీ మకర సంక్రాంతి వస్తుంది. సంక్రమణ - అంటే సంక్రమించడం. సంక్రమించటం అంటే చేరటం. చాంద్రమానానికీ - సౌరమానానికీ ఏదో సంబంధం ఉండి ఉంటుంది. తప్పకుండా ప్రతి సంవత్సరం జనవరి 13, 14, 15 తారీకుల్లోనే ఏదో ఒకరోజు అటు-ఇటుగా ఎప్పుడన్నా వస్తుంది.

క్రాంత దర్శనులైన ఋషులు మానవాళి మహోన్నతంగా మహోజ్వలంగా ప్రకాశిస్తూ, ఆనందిస్తూ, ఇహపరాల్లో శాశ్వత ఆనందాన్ని పొందవలెనని కాంక్షించారు. అటువంటి ఋషులలో ఆధునికుడన దగిన శ్రీవివేకానంద స్వామి మకర సంక్రాంతి ప్రారంభంలో జనవరి12, 1863 సం॥లో ఉదయించారు.

ఆ వివేకానందాన్ని ఆ వివేకాన్ని మనకు కూడా ప్రసాదించి, పాడి పంటలతో, పిల్లా పాపలతో, ఆయురారోగ్యాలతో, ఐకమత్యంతో ఆనందంగా జీవితాన్ని గడిపి శ్రీగురుదేవులతో సాయుజ్యముక్తిని పొందింప జేయ వలసినదిగా ప్రార్థిద్దాం!

**శ్రీ ఏకనాథ స్వామి ప్రయాగలో స్నానం చేసి, కావడిలో గంగాజలంతో రామేశ్వరానికి ప్రయాణమయ్యాడు. గంగ కావడిని నేలమీద పెట్టరాదు. అది నియమం.**

**దోవలో ఒక ఎడారిగుండా ప్రయాణం సాగింది. అక్కడ నీళ్ళు లేక ప్రాణాలు విడవటానికి సిద్ధంగా ఉన్న ఒక గాడిదను ఏకనాథుడు చూశాడు. అది వడగొట్టి విలవిలా తన్నుకుంటోంది. వెంటనే కావిడలోని గంగాజలం దాని గొంతులో పోసి, సేద తీర్చారు. మిగిలిన నీటితో దానికి, స్నానం చేయించి, తాపం పోగొట్టారు. సేద తీరిన గాడిద కృతజ్ఞతతో వారివైపు చూస్తూ తన దోవన పోయింది.**

**ఎంతో నియమంతో యింతదూరం మోసి తెచ్చిన గంగాజలం గాడిదపాలైందనే చింత ఏకనాథుడికి లేదు సరికదా, సజీవంగా ఉన్న రామలింగేశ్వరుడికి అభిషేకం చేసి, తన శ్రమను సార్థకం చేసుకున్నాను అనుకున్నారాయన.**

# దివ్యదర్శనం

-వి. సీతామహాలక్ష్మి

శ్రీబాబూజీతో అనుభవాలను గురించి చెప్పాలంటే మా జీవితంలో ప్రతిసంఘటనా మాకు అనుభవమే. మా పెద్దబ్బాయికి ఒడుగు చేయాలి అని అనుకున్నాం. మేము జమ్మలమడుగు తాలూక, వద్దిరాల గ్రామంలో ఉండేవారం. అక్కడ దగ్గరలోనే ముద్దనూరు గ్రామంలో శ్రీశంకర జయంతి నాడు సామూహిక ఉపనయనములు చేస్తున్నట్లు తెలిసి, అక్కడ మా అబ్బాయికి ఉపనయనం చేయించటానికి పేరు నమోదు చేయించుకున్నాము.

అక్కడ కొత్తగా బ్రాహ్మణ సంఘం ప్రారంభించటం వలన యజుర్వేదం వారు యిద్దరికి, ఋగ్వేదంవారు యిద్దరికి ఉపనయనం చేయించటానికి నిశ్చయించారు. ఎక్కువ వ్యవధి లేదు. పిల్లవానికి వుంగరం చేయించాలని, ఇంట్లో ఉన్న బంగారం యిస్తే సాయంకాలనికి ఉంగరం చేసి యిచ్చారు. ఆ సంఘంలో 116 రూ॥లు యిస్తే, నలుగురికి భోజనం, ఎక్కువ మంది వస్తే ఒక భోజనానికి ఐదు రూపాయలు తీసుకుంటామన్నారు. ముందురోజు సాయంత్రం అందరికీ భోజనాలు పెట్టారు. తెల్లవారుజామున బాజాభజంత్రీలతో చాలా వేడుకగా జరుగుతుంటే యింట్లో కూడా అంతవైభవంగా జరగదు అనిపించింది.

విఘ్నేశ్వరపూజ అయ్యాక పురోహితుడు దంపతులను ఉద్దేశించి 'మీ యిలవేల్పు ఎవరో చెప్పండి' అన్నాడు. మేము ఉభయులము ఒకరినొకరు చూసుకుని, 'మా సద్గురుదేవులు' అని చెప్పాము. వెంటనే ఆ హోమమంలో శ్రీసద్గురుదేవులు అభయ హస్తంతో మాకు కనిపించారు. ఈ ఉపనయనం అయినంతసేపూ శ్రీబాబు అలాగే వున్నారు. మాకు ఎనలేని సంతోషము, ఎవరిని చూసినా, ఏ దేవుడిని చూసినా అంత సంతోషము, ఆనందము కల్గుతుంది? ఈ అనుభవం శ్రీబాబుకి చెప్పాలని అనుకుని నంబూరు వచ్చాం. శ్రీబాబు మమ్మల్ని చూసి 'నా ఆశీర్వచనం అందిందా?' అని అడిగేసరికి ఆశ్చర్యపోయాం! మేము చెప్పవలసినది ఆయనే చెప్పేసరికి, మా నోటమాట రాలేదు. ప్రత్యేక యింటర్వ్యూలో శ్రీబాబుతో మాట్లాడాలి అన్నీ చెప్పుకోవాలి అనుకున్నాము. కాని మాకు అవకాశం దొరకలేదు.

# శ్రీబాబూజీతో అనుభవాలు

బి. లక్ష్మీ కామేశ్వర్

1965లో నా జన్మ ఇచ్చిన తండ్రి భీమవరంలో వుద్యోగరీత్యా వుండేవారు. మాఅమ్మగారు, శ్రీనాన్నగారు యిద్దరూ శ్రీబాబు దగ్గరకు వెళ్ళి రోజూ తీర్థప్రసాదాలు తీసుకొని వచ్చేవారు. నేను శ్రీబాబు వద్దకు రావటానికి మా అమ్మే కారణం. అమ్మ ఎప్పుడూ మేము చిన్నపిల్లలము అనే భావన లేక మాతో ఎప్పుడూ శ్రీబాబు విషయాలు, భగవంతుని విషయాలు మాతో ఎక్కువగా ప్రసంగాలు చేసేది.

అలా ఒక రోజు మా అమ్మ నాతో మాట్లాడుతున్నప్పుడు నేను శ్రీ బాబు స్వప్నంలో దర్శనం ఇచ్చారు. శ్రీ బాబు మూర్తి యిలా ఉంటుంది గదా అని వర్ణించాను. అప్పుడు మాఅమ్మ "అవును! ఇలానే ఉంటారు శ్రీ బాబు. నీవు శ్రీ బాబు దగ్గరకి రామ్మా! ఆయన ఆశీర్వచనం తీసుకుని, తీర్థప్రసాదాలు తీసుకుందాం " అని చెప్పినా నేను వెళ్ళడానికి నాకు మా అబ్బాయికి మూడో నెలనీ, వాడు అక్కడ ఉండలేక ఏడుస్తాడు. నేను రాలేను ఇంకొకసారి వస్తాను అని చెప్పాను. అప్పుడు మా అమ్మ ఎవరిని ఎప్పుడు తీసుకు రావాలో అంతా దైవ నిర్ణయం అని నన్ను బలవంతం చేయలేదు.

అమ్మా నాన్నగారు శ్రీబాబుతో ఎప్పుడు మాట్లాడినా మా కుటుంబం గురుంచీ. మా అబ్బాయి గురించి యోగక్షేమాలు అడిగేవారని అమ్మ నాతో చెబుతూవచ్చేది. తర్వాత కొంత కాలానికి సుమారు 7 నెలల తరువాత నాన్న గారికి విజయవాడ ట్రాన్స్ఫర్ కావడం మా అమ్మ నాన్న కాపురం గుంటూరు వచ్చింది.

మేము ఉద్యోగరీత్యా నూజివీడులో ఉండేవారము. నేను మా అబ్బాయిని తీసుకుని నూజివీడు వెళ్ళాను. అక్కడ మా అబ్బాయికి పదకొండు నెలలు ఉన్నప్పుడు ఫిట్సు లాగా వచ్చి చాలా కంగారు చేసింది. ఈవిషయం మా అమ్మ గారికి చెబితే వెంటనే వచ్చి మా దగ్గర ఉండి, నన్ను అబ్బాయిని గుంటూరు తీసుకెళ్ళింది.

నాకు అప్పటికి రెండోసారి ఏడోనెల. అమ్మ శ్రీ బాబు గుంటూరులో పాండురంగ శ్రీశైల రావుగారి ఇంటికి బాబు వచ్చారని తెలిసి, ఆరోజు ముక్కోటి అని మా అబ్బాయికి తీసుకుని మా అమ్మ

బాబు సన్నిధికి వెళ్ళింది. శ్రీబాబు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చిన తరువాత, పూజ అయిన తరువాత తీర్థప్రసాదాలిచ్చి, ఉపన్యాసం చెపారు. ఉపన్యాసం చెబుతున్నంత సేపు బాబు మా అబ్బాయి వంక తరుచూ చూస్తున్నారుట. మా అబ్బాయి కూడా శ్రీబాబు వంక అలానే చూస్తూ స్వామివారి కోసమని తెచ్చిన చక్కరకేళీ పళ్ళు మొత్తం తిన్నాడు. మా అమ్మ కూడా పిల్లవాడు పేచీపెడతాడని పండ్లు ఇస్తునే ఉన్నది. స్వామివారు ఉపన్యాసం అయిన తరువాత తీర్థానికి పిల్లవాణ్ణి తీసుకుని వెళితే బాబు తీర్థం ఇచ్చి, దగ్గరకు తీసుకుని ఆశీర్వదించి పంపారు.

మా అమ్మ “నీవు రాలేదు కానీ నీ కొడుకును దగ్గరకు తీసుకున్నారు. ఆశీర్వదించారు, అని అక్కడ జరిగిన ఉపన్యాసం అంతా చెప్పింది. అది విన్నాక తొందరలో శ్రీ బాబు దర్శనం నేనుకూడా చేసుకుంటే బాగుండును అని మనసులో అనుకున్నాను. తరువాత నెలలునిండి నాకు అమ్మాయి పుట్టింది. పురిటిస్నానం నాడు ముందు రోజు పురిటి చమురు పంచి పెడదామని బ్రాడిపేట వెళ్ళింది. అక్కడ పాండుగారింట్లో శ్రీ బాబు ఉన్నారని తెలిసి వారికి పురిటిచమురు ఇచ్చి శ్రీబాబు దర్శనం చేసుకుందామని వెళితే అమ్మతో శ్రీబాబు “రండి రండి మీకోసమే ఎదురు చూస్తున్నాను. అమ్మాయికి అబ్బాయా? అమ్మాయా? ” అని అడిగితే అమ్మ అమ్మాయే పుట్టింది అని చెబితే, “శుభం! అమ్మాయికి మనుమరాలికి నా ఆశీర్వచనాలు అని చెప్పండి”, అని అన్నారు.

అప్పుడు అమ్మ నా వద్దకు వచ్చి యీ విషయాలన్నీ చెప్పింది. 21వ రోజు మా అందరికీ పిల్లలని దైవదర్శనానికి తీసుకుని వెళ్ళడం అలవాటని, నేను చెప్పేలోపల ‘ఈరోజు శ్రీ బాబు వద్దకు తీసుకువెళ్ళి తీర్థప్రసాదాలు తీసుకుని వద్దాం’ అని అమ్మ చెప్పింది. సరే! నాకు మనసులో అదే ఆలోచన ఉంది కనుక నేను, అమ్మ, పిల్లలిద్దరినీ తీసుకుని 12 గం॥ శ్రీ పాండుగారింటికి వెళ్ళాం. అక్కడ శ్రీ బాబు పూజలో ఉన్నారు. బయట హాలులో భజన జరుగుతోంది.

సుమారు 2గం॥ ల తర్వాత శ్రీబాబు బయటకు వచ్చి హాలులో కుర్చీలో కుర్చుని అందరికీ తీర్థాలిస్తున్నారు. శ్రీబాబు ప్రథమ దర్శనం లోనే ఏదోనాకు ఏదో ఆనందం, వారి మూర్తిని మళ్ళీ మళ్ళీ చూడాలని కోరిక అనిపించి అందిరితో తీర్థానికి వెళ్ళి చేయి పట్టాను. అందరూ నమస్కారం

చేసుకున్న తర్వాత తీర్థం తీసుకుంటున్నారు. నాకూ నమస్కారం చేసుకోవాలని ఉన్నా కొన్ని సందేహాలు ఉన్నాయి. వారిని తాకవచ్చా? పాదనమస్కారం చేసుకోవచ్చునో లేదో అని.

ఇన్ని సందేహాలతో ఆయన దగ్గర చేయిపట్టి తీర్థం తీసుకుని అప్రయత్నంగా శిరస్సు వంచి సమస్కారం చేసినపుడు నాశిరస్సు ఆయన బొటనవేలుని తాకంగానే నాలో చాలాపెద్దకాంతి ప్రవహిస్తున్నట్లు అంతా వెలుగు నాకు తెలియని ఆనందం నాలోకి వస్తున్నట్లు అనిపించింది. ఇది ఎంత సేపు అని ప్రశ్న వేసుకున్నప్పుడు కొద్దిసమయమే అనిపించినా, నాలో యిప్పటికీ ఆ అనుభూతి తలచుకుంటే ఆనందం అది మాటలతో చెప్పలేను. ఆ వెంటనే శ్రీ బాబు వంక చూడగానే నవ్వుతూ ఆశీర్వదించారు. ఇది శ్రీబాబు  నా పట్ల చూపిన అపారకరుణా కిరణాలు.

అలాగే శ్రీబాబు వద్దకు తరచూ వెళుతూ ఉండేవారము. తర్వాత కొద్దిరోజులకు నవరాత్రి ఉత్సవములు గుండుగొలనులో జరిగేవి. అమ్మ నాన్నలను శ్రీ బాబు రమ్మని చెబితే అమ్మ ఇంటి దగ్గర ఉండి నాన్నగారు తీర్థప్రసాదం తీసుకుని  ఆ రోజు పాదపూజ చూసుకుని వస్తానని వెళ్ళారు.

అదే రోజు రాత్రి మా అబ్బాయికి రెండోసారి ఫిట్సు  వచ్చి. అవి ఆగకుండా చాలా తీవ్రమైన జ్వరము ఒకవైపు వణకటము వచ్చింది. వెంటనే మా ఫామిలీ డాక్టరు డా॥ అమరేశ్వరరావు గారి వద్దకు తీసుకుని మా అమ్మ వెళ్ళింది. "ఈ అబ్బాయిని వెంటనే గవర్నమెంటు హాస్పటల్‌కు తీసుకివెళ్ళండి ఈ అబ్బాయి బ్రతకటం కష్టం బ్రతికినా మైండు ఉండక పోవచ్చు. ఇది మెనెంజైటీస్ అనే వ్యాధని అనుమానంగా ఉంది నావల్ల కాదు" అన్నారు.

ఆయన అలా చెప్పగానే మేము గుంటూరు గవర్నమెంటు హాస్పిటల్‌కు తీసుకువెళ్ళగానే ఎమర్జెన్సీలో చేర్చుకుని వాడికి గార్డ్‌నాల్ ఇంజక్షన్ ఇచ్చి, రేపు ఛీఫ్ డాక్టర్ గారితో మాట్లాడుతాము. రేపటివరకు ఏమీ చెప్పలేము అనగానే అమ్మ వాడిని మంచంమీద పడుకోబెట్టి 'నీవు ఇంటికివెళ్ళు, నేను ఇక్కడేఉంటాను' అంది.

"అమ్మా! వాడు నీ బిడ్డ, నా బిడ్డకాడు", అనీ ఏడుస్తూ ఇంటికి వచ్చేశాను. తర్వాత కొద్దిసేపటికి శ్రీ బాబు మొత్తం పీఠంతో సహా వాడి పక్కన ఉన్నట్లు,  పాదపూజ కార్యక్రమాలన్నీ అంతా జరుగుతున్నట్లు

మాఅమ్మకి అనుభూతిని కలగచేశారు. అమ్మ శ్రీ బాబు దయ వీడికి పూర్తిగా ఉన్నది వాడికి భయంలేదు అని బాబు నామస్మరణ చేస్తూ . లలితా పారాయణం చేస్తూ ఉన్నది.

తెల్లవారాక 10 గం॥ నాన్నగారు తీర్థ ప్రసాదాలు గుండుగోలను నుండి తీసుకుని వచ్చారు. రాగానే నాన్నగారు "శ్రీబాబుకి నమస్కారం చేసుకుంటూండగా విభూతి తీసి యిచ్చారు. ఇచ్చి ఇది పిల్లవాడికి పెట్టి, కుంకుమ అక్షితలు పెట్టి తీర్థప్రసాదాలు ఇవ్వండి, అని అన్నారు" అని చెప్పారు.

హాస్పటల్‌కి విభూతి, కుంకుమ, తీర్థము తీసుకునివెళ్ళి పిల్లవాడికి పెట్టాము. రాత్రి చాలా బాధపడ్డాడు పిల్లవాడు. డాక్టరు వచ్చాక నిర్ణయం జరుగుతుంది ఏంజరుగుతుందో అని మాకు చాలా భయంవేసింది. ఇంతలో డాక్టరు రౌండ్సుకి వచ్చి ఈపిల్ల వాణ్ణి ఈ వార్డులో ఎందుకు ఉంచారు? ఇది ఆ వ్యాధి కాదు. డిస్చార్జి చేసి గార్డ్‌నాల్ ఇంజెక్షన్స్ ఫిట్సు రాకుండా మందులు రాసి రోజు ఒ.పి. లో రమ్మన్నారు.

అలా రోజు వాణ్ణి చూచి బెంగ, భయంగా ఉండేది. శ్రీ బాబు ఎప్పుడు వస్తారో వాణ్ణి శ్రీ బాబు వద్దకు ఎలా తీసుకుని వెళ్ళాలో అని అనుకుంటూండగా ఒక రోజు శ్రీ బాబు పాండుగారింటికి వచ్చారని తెలిసి అమ్మ పిల్లవాణ్ణి దగ్గరకు తీసుకుని "తాతా! నీది ఎంతో మంచి బుర్ర, డాక్టర్లు నిద్రమాత్రలు వేసి పాడుచేస్తున్నారు. నేనున్నాను అమ్మా నాన్నలకు నీఒక్కడవే బిడ్డవు. నీవు పిచ్చివాడవైతే ఎలా? నిన్ను నేను దక్కించు కుంటాను తాతా," అని అపారకరుణామూర్తి అభయహస్త మిచ్చి వాణ్ణి దగ్గరకు తీసుకుని, ఆరోజు నుండి సుమారు 6 సం॥ వచ్చేవరకూ మందూ తీర్థ ప్రసాదములిచ్చి వాణ్ణి మా బిడ్డగా ఉంచటమేగాక సి.ఎ. లో ఇంటరులో ఫైనల్లో ర్యాంకు ఇచ్చి సంరక్షిస్తున్నారు.

ఎప్పుడైనా మా వారు శ్రీ బాబు తో "బాబూ! మీరు మా బిడ్డకు ఇంత దయతో మాకు ఈ ఆనందాన్ని ఇచ్చారు. ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగలను? చర్మం ఒలిచి చెప్పులు కుట్టించి యిచ్చినా మీ ఋణం తీరదు బాబు," అనే వారు. అప్పుడు బాబు దానికి " అంత మాట అనకు నాయనా, నేను చేసింది ఏమీ లేదు. జగజ్జనని కృపని మీపై వర్షింప చేయటమే నాపని" అని చాలా దయగా ఏమీ చేయనట్లే చెప్పేవారు.

అటువంటి నిర్హేతుకదయ, జీవకారుణ్యమూర్తి శ్రీ బాబు. వాడికి

మందు  ఆయుర్వేదంలో 27 రకాల దినుసులతో చిత్రమూలం వేళ్ల బెరడుతో నిజరసం తీయించి, దానిలో మందు వేసి మాత్రలు కట్టించి, అల్లంరసంతో అనుపానంతో ఇచ్చేవారు. ఆ చిత్రమూలం కొండలలో ఉంటుంది. మంగళగిరి కొండలలో వెతకండి అన్నారు శ్రీబాబు.

నాన్నగారు మనిషిని పంపి తెప్పించారు. మొదటిసారి వేళ్ళు దంచేటప్పుడు "కళ్లలో ఒక్క బొట్టుకూడా పడకూడదు. కళ్ళు పోతాయి" అని శ్రీ రాఘవయ్యగారు అనే భక్తులతో చేయించి ఇచ్చారు. ఆరస ప్రభావంవల్ల చేతులు కాలిన గాయాలుగా అయ్యి మంటలు వస్తాయి. అప్పుడు అమ్మ శ్రీ బాబుతో  "మా బిడ్డ గూర్చి ఇంకొకరిని బాధ పెడుతున్నాము. ఈ సారి నేను పిల్లలు కలిసి తీస్తాం" అని చెబితే చాలా జాగ్రత్తలు చెప్పి అక్కడ ఒకసారి అమ్మ చేత చేయించారు. అప్పుడు ఆవిడ శ్రీ లలితా పారాయణంతో చేస్తుంటే "యిలా చేస్తేనే మందు బాగా పట్టిస్తుంది" అని బాబు అన్నారు. ఇంక "ఇంటికి వెళ్లండి పిల్లలతోజాగ్రత్తగా చేయించండి. వారికి ఏమీ కాదని చెప్పారు" అమ్మ శ్రీ బాబు అనుజ్ఞ తీసుకుని వచ్చి మా అందరిచేత చేయిస్తే చేతులు మంటలు లేవు కానీ చర్మం అంతా బొబ్బలెక్కాయి. వెంటనే శ్రీబాబుని తలుచుకుని కొబ్బరినూనె రాయమన్నారని చెప్పి రాసింది. తర్వాత పెద్ద బాధ లేకుండా మాకు రెండు మూడు రోజులలో తగ్గింది.

మా అబ్బాయిని అమ్మా నాన్న దగ్గర అట్టిపెట్టమని శ్రీ బాబు చెప్పారు. మందు అల్లంరసం అనుపానంతో వాడమని చెప్పారు. అమ్మ "బాబు! ఏడాది పిల్లవాడు అల్లం రసంతో ఘాటుగా ఉంటుంది, వాడికి ఎలా తాగించాలి" అని  అడగగానే "భయంలేదు బాబు మందు అని వాడికి చెప్పండి. వాడు తాగుతాడు" అని చెప్పారు. మేం ఆశ్చర్యపోయాం ఇది జరుగుతుందా అని.

వీడు చిన్నపిల్లవాడు అనుకుని మర్నాడు ఉదయమే అల్లంరసం తీసి "నాన్నా ఇది  శ్రీబాబు మందు నీవు తీసుకో," అనగానే వాడు వేరే పేచీ లేకుండా అల్లంరసం పంచదార పానకంలా తాగి మందు వేసుకునేవాడు. పసిబిడ్డ హృదయంలో కూడా ఆయన చెప్పిన వెంటనే మార్పు వచ్చేది. ఇది ప్రత్యక్షంగా చూసినది. అటువంటి నిర్హేతుక దయా మూర్తి శ్రీబాబు!

# కృతజ్ఞతలు

శ్రీ సమర్థ సద్గురుదేవుల రజతోత్సవ మహాపుణ్యారాధన, పరమ హంస గాయత్రి మహాయాగము, సాధు సమ్మేళనము, శ్రీయతీశ్వర పూజ ది.20-11-2013 నుండి 01-12-2013 వరకు ఎంతో విజయవంతంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు పిలిచినంతనే సాధు మహాత్ములందరూ తమ అంగీకారమును తెలియజేసి, ఎంతెంతో దూర ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు తమ దివ్య సందేశమును అనుగ్రహించి, పావనము చేసినందుకు వారికి మా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము.

శ్రీ సద్గురుదేవుల మహాపుణ్యారాధన రజతోత్సవము విశేషంగా జరుపుకొనుచున్న విషయం తెలిసినంతనే భక్తమహాశయులంతా ముందుగానే ప్రణాళిక వేసుకుని, కార్యక్రమంలో మొదటి నుంచి చివర వరకు పాల్గొని విజయవంతం గావించారు. ఎంతోమంది భగవద్భక్తులు గురుభక్తులు ఢిల్లీ, ముంబాయి, షోలాపూర్, అహ్మదాబాద్, బెంగుళూరు, చెన్నై, పాణిపట్, ఋషీకేశ్ వంటి అనేక సుదూర ప్రాంతాల నుండే కాక, ఆస్ట్రేలియా, నార్వే, డెన్మార్క్, ఇంగ్లాండ్, నెదర్‌లాండ్స్, అమెరికా, గల్ఫ్ వంటి యితర దేశాల నుండి కూడా వచ్చి పాల్గొని, ఆనందాన్ని కలిగించిన మహాశయులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము.

ఎందరో యువతీ, యువకులు, ఉత్సాహవంతులు, శ్రీసద్గురు యువసేవా సమితి సభ్యులు ఎంతెంతో కృషిచేసి, రాత్రింబవళ్ళు కష్టపడి కావలసిన ఏర్పాటు చేయటమేకాక, వచ్చిన భక్తులకు సదుపాయాలు కలుగజేయటానికి సహాయ సహకారములు అందించిన వారందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము.

కార్యక్రమములు నయనానందకరంగా దివ్యంగా, భవ్యంగా, అత్యంత ఆనందకరంగా, న భూతో, న భవిష్యతి అన్నట్లుగా జరపటానికి వలసిన ఆర్థిక సహాయ సహకారములు అందించిన వారికి మా హృదయ పూర్వక ధన్యవాదములు!

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి, సేవా సహకారములు అందించిన వారికి శ్రీసద్గురుదేవుల ఆశీస్సులు సదా లభించుగాక!!

గౌరవ కార్యదర్శి

శ్రీకాళీవనాశ్రమము

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు**

శ్రీరామకృష్ణ పరమహంస జగన్మాతను పూజిస్తూ, మధ్యలో తమను తామే పూజించుకొనే వారు. అలాగే వారి సహధర్మచారిణియైన శారదా దేవిని కూడా పూజించారు. అంటే తమకు, జగన్మాతకు, శారదా దేవికీ, అలాగే కనిపించే యీ జగత్తుకు అభేదమనేదే వారి ఆరూఢ జ్ఞానం. కాని వారు నిత్యమూ చేసిన జగన్మాత పూజ, కేవలం మానవాళికి భగవంతుని యెడల భక్తి ప్రపత్తులను నే ర్పటం కోసమే" అని వివరించారు. గురువుగారు, సరిగ్గా తాము మనస్సులో అనుకున్న మాటలే శ్రీ బాబు అలా వివరించటం చూసి ఆశ్చర్యపోయారు.



తాము అనుకున్నట్లుగా వారు కేవలం భూత వైద్యులు మాత్రమే కాదని, భవరోగ వైద్యులు కూడా అని గ్రహించారు. ఇందిర నీరసంగా వుందని తీర్థానికి రాకపోతే, రాఘవయ్యగారిని పంపించి ఎత్తుకుని రమ్మని పంపించారు శ్రీ బాబు.

మరునాడు గురువుగారి చెల్లెలు, మరిదిగారు వచ్చారు. వాళ్ళందరూ శ్రీ బాబుని గురించి ఏవో మాట్లాడుకున్నారు. ఆ రాత్రి తమ ఉపన్యాసంలో శ్రీ బాబు "వీడు చదువుకోలేదు, నంగిగా యాసగా మాట్లాడతాడు. సరిగా అర్థం కాదు. మధ్య మధ్య ఎందుకు నవ్వుతాడో తెలియదు అని యిద్దరు అప్ప చెల్లెళ్ళు యీ రోజు మధ్యాహ్నం నన్ను గురించి మాట్లాడుకున్నారు. నా దగ్గర కర్ణ పిశాచి ఉందని, అది నాకు యీ విషయాలన్నీ చెప్పేస్తుందని వాళ్ళకు తెలియదు పాపం!" అని చెప్పేసరికి వాళ్ళు నిర్ఘాంత పోయారు.

"ఈయనకు దూర శ్రవణం, దూర దృష్టి మనస్సులోని మాటలను చెప్పే శక్తి కూడా ఉన్నాయి, కనుక మనం ఆయనను గురించి మంచిగానే ఆలోచించాలి, మంచిగానే మాట్లాడుకోవాలి" అని జాగ్రత్త పడ్డారు. ఆ మరునాడు శ్రీ బాబు గురువుగారిని ఉపన్యాసం

చెప్పమన్నారు. "నాకేమీ రాదు" అని గురువుగారు అంటే " నాకు తెలుసు లెండి మాట్లాడండి" అన్నారు. గురువుగారు రాధాకృష్ణ ప్రేమ తత్త్వాన్ని గురించి నిజంగానే చక్కగా మాట్లాడారు. శ్రీ బాబు "మీరు చాలా బాగా మాట్లాడారు, ఎంతో చక్కగా చిలక పలుకుల్లా ఉన్నాయి" అన్నారు, గురువుగారికి ఉడుకుమోతుతనం వచ్చినా " నిజమే గదా! ఆ రాధాకృష్ణ ప్రేమతత్త్వం లోని మాధుర్యాన్ని అనుభవ పూర్వకంగా గ్రహించే వరకు, దానిని గురించి మాట్లాడే మాటలు, చిలుక పలుకులు గాక మరే మవుతాయి?" అని తమకు తాము సర్ది చెప్పుకున్నారు.

ఆ తరువాత శ్రీ బాబు గురువుగారికి ఒకసారి కృష్ణునివలె, ఒక సారి రాముని వలె, ఒకసారి దుశ్శాలువ, ఘంట, కంకణాలు, మకర కుండలాలు ధరించిన మహా పండితునివలె, మరొకసారి పెద్ద జమీందారు వలె యిలా ఎన్నో రూపాలలో దర్శనమిచ్చారు. తమ ఉపన్యాసంలో శ్రీ బాబు శ్లోకాలు గాని, సంస్కృత పదాలు గాని లేకుండా తియ్యని తేట తెలుగులో, సర్వ వేద ఉపనిషత్ శాస్త్రముల సారమంతటినీ పామరునికి కూడా అర్థమయ్యే రీతిలో అందించటం చూసి గురువుగారు ముగ్ధులైనారు. సహజమైన పాండిత్యం అంటే యిదే అని గ్రహించారు. జయంతులైన తరువాత కొంచెం నయంగా ఉందని గురువుగారు యిందిరను గుంటూరు తీసుకుని వెళ్ళారు.

వేసవిలో యిందిరకు మళ్ళీ తిరగ బెట్టింది. అప్పుడు శ్రీ బాబు భీమవరం తాతయ్యగారి యింట్లో ఉన్నారని తెలిసి, గురువుగారు యిందిరను అక్కడకు తీసుకుని వెళ్ళారు. ఆ మూడు నెలల్లో యిందిరకూ గురువుగారికీ కూడా శ్రీ బాబు ప్రసాదించిన మహదనుభవాలు దివ్య దర్శనాలూ కోకొల్లలు.

గురువుగారు తమనిత్య దేవతార్చన సామాగ్రిని భీమవరం తీసుకుని వెళ్ళారు. ప్రతి రోజు మడి, పూజ, ధ్యానము, యివి గాక యిందిర కోసం పత్యేక జపానుష్ఠానములు చేసేవారు. ఒక రోజు చెల్లాయమ్మగారు శ్రీ బాబుతో "యిందిర తాను చాలా బాధ అనుభవించటమే కాక (ఆమె లోని గ్రహం) గురువుగారిని చాలా అవస్థలు పెడుతోంది బాబు ! వారు చాలా మంచి వాళ్ళు. త్వరగా నయం చెయ్యండి." అన్నారు. శ్రీ బాబు "మంచి వాళ్ళే కాని, లౌక్యం బాగా ఉన్న వాళ్ళు" అన్నారు.

-సశేషం

(గతసంచిక తరువాయి) విష్ణు  కథలు -రమణ ప్రసాద్

# 7. రోహిదాసు

పరమ పవిత్ర మైన కాశీ క్షేత్రంలో రఘు అనే వ్యక్తి ఉండేవాడు. చెప్పలు కుట్టే కులానికి చెందినవాడు. రాత్రులందు రాజుగారి ఆస్థానంలో కాపలాదారుగా ఉండేవాడు. చాలా కాలంగా అతనికి సంతానం లేదు పుత్ర సంతానం కోసం భగవానుని ధ్యానిస్తూ ఉండేవాడు. భగవత్ ప్రసాదంగా అతనికి ఒక పుత్రుడు జన్మించాడు. అతనికి రోహిదాస్ అని నామకరణం చేశాడు.



ఆ పిల్లవాడు పుట్టినది మొదలుకొని విలపించలేదు సదా శాంత వదనుడై కనిపించేవాడు. పానీయాలను కూడా త్రాగటంలేదు. ఇతని ప్రవర్తన కుటుంబం లోనివారికేగాక, నగర వాసులందరిని కూడా ఆశ్చర్య చకితుల్ని చేసింది. బ్రహ్మజ్ఞాన కాంతులీను ఇతడు మహాజ్ఞాని వలె కన్పడుతున్నాడు యోగభ్రష్టుడై జన్మించాడేమో" అని చెప్పకునే వారు.

ఈ వింత వార్తవిని రాజ కొలువులో ఉన్న నర్తకి రోహిదాసుని చూడటానికి వస్తుంది. ఆయనలో ప్రసన్న వదనుడై విచారిస్తున్న రోహిదాస్‌ను చూస్తుంది. "ఎంతటి బ్రహ్మవర్చస్సు? గతజన్మలో వీరు గొప్ప సాధకులై ఉండాలి" అనుకొని 'మహాత్మా ఎవరు మీరు?' అని అప్రయత్నంగా అన్నది రాజనర్తకి.

వెంటనే ఊయలలో పడుకొని వీక్షిస్తున్న రోహిదాస్ నవ్వుతూ "ఒకనాడు గురు ఆజ్ఞానుసారం నా ఇంట నైవేద్యమునకు వస్తు సామాగ్రిని నిరాకరించిన బ్రాహ్మణకులం వాడను. నేను శాపవశాత్తు ఈ ఇంట్లో జన్మించాను." అన్నాడు.

నర్తకి మనస్సులో ఆలోచన సుడిగుండం ప్రారంభమైంది. కొన్ని సంవత్సరాల క్రిందట జరిగిన ఘటన జ్ఞప్తికి వచ్చింది. ఇతడు బాల్యముననే

మరణించి తిరిగి ఈ ఇంటిలో జన్మించినాడు అన్న విషయం జ్ఞప్తికి వచ్చింది.

కాశీ క్షేత్రంలో భాగవతోత్తముడైన రామానందస్వామి ఉండేవాడు. వారి వద్ద అనేక మంది శిష్యులు ఉండేవారు. ఒక నాడు శిష్యులలో ఒకరిని పిలిచి భగవానునకు సమర్పించుటకు వస్తు సామాగ్రిని ఒక గృహస్థుని అడిగి తెమ్మని చెప్పాడు. అయితే ఆ గృహస్థుడు భక్తుడై, శీలవంతుడై ఉండాలి ఉత్తమ మార్గంలో జీవితయాత్ర చేసేవాడై ఉండాలి" అని చెప్పారు రామానంద స్వామి.

శిష్యుడు ఒక ఇంటి ముందు నిలబడి తనకు కావాల్సినది అడిగాడు. ఆ ఇంటిలో నుండి ఒక స్త్రీ అతను అడిగిన వస్తువులన్నీ ఒక పళ్ళెంలో పట్టుకుని తెచ్చింది. గురువుగారి షరతులు గుర్తు వచ్చి "మీరేమిటి?" అని ప్రశ్నించాడు. "నేను రాజనర్తకిని" అని ఆమె సమాధానం చెప్పింది. బ్రహ్మచారి మనస్సు వాటిని తీసుకొనటానికి అంగీకరించలేదు. వాటిని తిరస్కరించి వచ్చాడు.

ఇంతలో వర్షం ప్రారంభమైంది. కుండపోతగా వర్షం కురుస్తోంది. ఒక ఇంటి ముందు పంచలో బ్రహ్మచారి తలదాచుకున్నాడు. ఆ ఇంటి యజమాని వచ్చి చూసి ఆ బ్రహ్మచారికి ఏమికావాలో తెలుసుకున్నాడు. ఆ వస్తు సామాగ్రిని తెచ్చి తన జన్మ చరితార్థం చేయమని ప్రార్థించాడు. ఆ యజమాని చెప్పులు కుట్టి జీవించే మాదిగ కులంవాడు. ఆ సమయంలో మరోమార్గం లేక అతని వద్ద నుండి వస్తు సామాగ్రిని గ్రహించాడు. అది తీసుకొని గురువుగారి వద్దకు చేరాడు. త్రికాల వేదితుడైన రామానంద స్వామి జ్ఞాన దృష్టితో సర్వం గ్రహించి. "వత్స! నా ఆజ్ఞకు వ్యతిరేకంగా వర్తించావు. నీచ వృత్తిలో జీవించే మాదిగ వాని ఇంట సంభావన తెచ్చి అపవిత్రం చేయ సంకల్పించావు. దీని ఫలితంగానువ్వు మాదిగవాని ఇంట జన్మిస్తావు" అని శపించాడు.

అశృపూరిత నయనాలతో బ్రహ్మచారి గురువుగారి పాదాలకు నమస్కరిస్తు "మహాత్మ! మోక్షకామినై మీ పాదాల నాశ్రయించాను. చివరకు నా బ్రతుకు ఇలా నరకతుల్యమైంది అని విలపించాడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL